కావడికుండలు.

పరుపుమీద చారబడి పుస్తకం విప్పినా శాంతకు నిద్దర రావటంలేదు. అప్పుడే పదకొండు కొట్టింది. దీపం ఆర్పేయాలనుకుంటూనే చిన్నక్క పరుపువేపు చూసింది. రాధ అగపడలేదు. అయినా దీపం ఆర్పి పరుపుమీద కూర్చుంది...

పెళ్లిచూపులనాటినుండి అక్కయ్య సంచరించే విధం చూస్తుంటే ఆమె కేదో అసూయ పుట్టుకొచ్చింది ఇదివరలా కిలకిల నవ్వుతూ కబుర్లతో కరిగించి, నవ్వించకుండా ఏకాంతంగా కూర్చొని ఏకధాటిగా ఆలోచించుకోవటం శాంత కేమీ నచ్చలేదు. ఆశలు, కోరికలు సమాజంలో యింకొకరివి ఫలించటంతో మనిషిలో యివి రెచ్చకొట్టబడతాయ్. శాంత మనస్సులో అక్క పెళ్లిచూపులై గడచిన మూడువారాలలోనూ అంతూ పంతూ లేని ఆలోచనలు పరుగెత్తినయ్ అంటే ఆశ్చర్యపడవలసిన విషయం కాదు.

ఆమె లేచి గదిలో యిటూ అటూ చీకటిలో పచారు చేసినా ఆలోచనాప్రవాహాన్ని అరికట్టలేకపోయింది. ఎడబాటు ఒక్కసారిగా సహించటం ఆమెకు కష్టమయిపోయింది. ఈ ఆలోచనలతోపాటు ఆమెదృష్టి కిటికీవేపు పోయింది. తలుపు చారవేసివుండబట్టి అక్క తోటలోనికే వెళ్లివుంటుందనుకుంది. శాంత మల్లెపందిర నానుకొని వినీలాకాశంవేపు చూస్తోంది. మబ్బు విడిచిన చందమామ మెల్లగా కదుల్తున్నాడు! ఆమె కోరికలను దాచిపెట్టిన అసూయ మెల్లమెల్లగా విడిచిపోతోంది!!

రాధ దగ్గరగా వచ్చి 'అక్క డేమీలేదు చెల్లీ' అంది. అక్క బొంగురుపోయిన గొంతుక విని కంగారు కప్పిపిస్తూ 'ఏం అక్కా!' అంది.

'ఏం టలా దీర్ఘంగా...'

'చూడక్కా! ఎంత చల్లగా వుందో'

తడుముకోకుండా, రాధ, 'అలాంటిచల్లటి మొగుడేవస్తాడులే' అంటూనే గదిలోనికి వెళ్లిపోయింది. అక్కయ్య యీమాటలు అని ఆమెమనసులో సువ్యక్తం కాని యేవేవో ఆలోచనలను గిరగిర తిప్పి వేసింది.

గదిలోనికి వచ్చిన శాంత అక్కమంచంమీద కూర్చుంది. 'పోయి పడుకోవే' అంది రాధ.

'పడుకుంటాను—కాని, ఒకమాట...'

శాంతకూడ ఆగిపోయింది. రాధ కొంతసేపయ్యాక 'చెప్పాలని లేదా?' అంది.

'ఈవారంరోజులైనా నాతో సరిగ్గా మాటాడకూడదా? ఎంత అందగాడైనా యెప్పుడూ నీదగ్గర వుండవలసినవాడి గురించే ఆలోచించాలా?'

చెల్లెలు కొన్నాళ్ళనుంచి అడగాలనుకున్నప్రశ్న యీ వేళ అడిగింది. ఈ ప్రశ్న వేసి జవాబుకోసం నిరీక్షిస్తున్న శాంతకు కొద్ది నిముషాలకు చిరాకు వేసింది.

'ఈసంబంధం నాన్న కిష్టం లేదే' అంది పెద్దనిట్టూర్పుతో రాధ.

ఈ మాటల్లో వ్యక్తమౌతున్న బాధను శాంత కొంత వరకు గ్రహించినా అక్క యేదో నిజాన్ని కప్పిపుచ్చటానికి

యీమాటలను అందేమో అనుకుంది. కాని, నాన్న గురించి అక్కయ్య అలా అందంటే ఆమెకు చాలా విడ్డూరంగా కనిపించింది.

'శుద్ధఅబద్ధం అక్కా!' అంది.

'నాచెవుల్నే నమ్మవద్దంటావా?'

'నాన్న అనటమే విన్నావా? అయినా నాన్నయెవరితో యెప్పుడు చెప్పారని?'

'సుందరంతో... మొన్న నే'

'ఏంటో, నాన్న అన్నారంటే నమ్మలేనే......నువ్వు సరిగ్గా విన్నావా?'

'గాలి లేదని డాబామీదకు వెళ్లానే. ఆయనతో చెప్తుంటే విన్నాను'

'చెప్పినా చెప్తారులే! ప్రక్కనే మంచంవేసి పడుకోబెట్టుకుంటున్నారుగా! ఈ యింటికి యజమానిని చేసేస్తారేమో!'

కోపంగా అంటున్న చెల్లెలి వేపు ఒకసారి చీకటిలోనే చూసింది. తరవాత రాధ చేతితో నుదురుకప్పుకుంది.

'ఇంకేం మాటాడుకున్నారక్కా?'

'పోయి పడుకో చెల్లీ...తలనొప్పిగా వుంది!'

'అబ్బా! దానికే అంత భయపడాలా! నాన్నకు ఆలోచనా పాలోచనా లేదు!!'

రాధ చిరాకుతో లేచి వెళ్లిపోతున్న చెల్లెల్ని కిటికీగుండా వచ్చే కాంతిలో చూస్తూ హీనస్వరంతో ఆగిఆగి'నాన్న యీలోకంలో మనుష్యుల్ని అరవైయేళ్లు చూసారే!'

ఈ మాటలు విననట్టే శాంత పరుపుమీద వాలింది!!

౨

భళ్లున తెల్లవారింది. సుందరం కొళాయిదగ్గర స్నానం చేసి మేడమొదటిమెట్టుమీద కాలువేసి ఆగి అలా వస్తున్న శాంతవేపు చూశాడు. ఈ చూపులో అంతర్యాన్ని గ్రహించిన శాంత ముఖంముడుచుకొని చరచరా మళ్లీ గదిలోనికి వెళ్లిపోయింది. వచ్చిన యీమూడురోజులలోనూ తనవేపు చూడని సుందరం యీరోజు దీక్షగా యెందుకు చూడాలి? ఇటూ అటూ గదిలోనే గిరగిరలాడింది. పరుపుమీద మళ్లీ వారబడి ఆవలించింది.

సుందరం గురించి ఆలోచించటానికి తీరిక లేకపోయింది. అమ్మ అప్పుడే స్టేషనుకు పోడానికి తయారైంది. శాంతలేచి స్నానంచేసి అలంకరించుకొనే సమయానికి ఒక స్వచ్ఛమైన గొంతుక మేడమీద గీతాపారాయణం చెయ్యటం వింటూనే వుంది. ఆగొంతుక సుందరందే అని పోల్చుకుంది.

అమ్మతో కలసి మేడమీదకు వెళ్లేటప్పుడు డాక్టరుగారు బట్టలు వేసుకుంటూ దగ్గర కుర్చీమీద కూర్చున్న సుందరంతో అంటున్నారు. "ఈ జన్మలో యేం సుఖపడ్డానో చిన్నప్పుడు అమ్మవల్ల...గడించుకొనే రోజుల్లో పెద్దకూతురు వల్ల...."

నరసమ్మ, శాంత అలా నిలుచునే వున్నారు. డాక్టరుగారు ముఖం ముడుచుకున్న భార్యవేపు చూడకుండానే మళ్లీ మొదలుపెట్టారు:

"ఫస్టు గ్రేట్ వార్‌లో ఫ్లేండర్సులో ఒకరాత్రి ఒక సైనికుడి గాయానికి కట్టుకడుతూ అలా పడిపోయాను. అమ్మా

అని అరిచానని, నాకు తెలివివచ్చాక, యింకో డాక్టరు చెప్పాడు. గాయం తగిలిన సైనికుడు నన్ను బాధతోనే అడిగాడు—'డాక్టరుగారూ! మాఅమ్మకు నే నొక్కడనే..... చాలా కష్టపడిపెంచింది...వద్దంటే సైన్యంలోనికి వచ్చాను... బ్రతికి మా అమ్మను మళ్ళీ చూస్తానా?' అని. ఈ మాటలు చచ్చిపోయేముందు అంటున్నాడేమో, మా అమ్మ జ్ఞాపకం వచ్చింది. నేనూ ఆసైనుకుడిలానే చేశాను... నాకూ గాయం తగులుతుంది...నేనూ మాఅమ్మను చూడకుండా యిలాగే చచ్చిపోతాను!! కాని...ఇన్ని గండాలు గడిచి వచ్చానురా బాబూ! ఇన్ని ఆసుపత్రులు చూశాను...రిటైరయ్యాక డిస్పెన్సరీ పెట్టాను...అరవైయేళ్లు దగ్గరపడ్డాయీ...?"

చెప్పులప్పచెప్పి తలెత్తి ప్రశాంతంగా సుందరం వింటున్నాడు.

"ఎందు కింత బలంగా వున్నాను? మా అమ్మనించే. ఏం చేసేదంటావ్ ? కులంవాళ్ల యిళ్లల్లో పొద్దున్నుంచీ సాయంత్రింవరకూ ధాన్యం దంచో, అంట్లు తోమో సేవ చేసేది. మెత్తని తవుడు రొట్టెచేసి వుంచేది. నేను పట్నంలో బడి విడిచిపెట్టాక ప్రయివేట్లు చెప్పుకొని నాలుగుమైళ్లు నడిచి యింటికి వెళ్ళేసరికి ఆరొట్టె యిచ్చేది. తిని మంచినీరు త్రాగే సరికి అమ్మకళ్లు నీటితో నిండిపోయేవి. అంబలీ గంజీ త్రాగి నలుగురికాళ్లూ పట్టుకొని చదివించింది. నాకొడుకు గడించుకొనేటప్పుడు మీ ఋణం తీర్చుకుంటాననేది. నేను గడించుకొనే రోజుల్లో ఒకనాడు మాఅమ్మదగ్గర కూర్చొని 'ఆ చిన్నాపెద్దల భూములన్నీ కొనేశా' నని చెప్పేరోజున రెండు చేతులూ చూసు

కొని బావురుమని యేడ్చింది. 'ఈచేతులతోనే ఆపాలాలిచ్చిన తవుడురొట్టెలు చేసి యిచ్చాను, ఇప్పుడు ఆబియ్యాన్ని ఈచేతులతో వండివ్వలేను నాయనా' అంది."

డాక్టరుగారి స్వరం కాస్త మందగించింది.

"నా కివ్వవలసిందంతా ప్రేమతో చిన్నప్పుడే యిచ్చింది. అతవుడురొట్టెలలో విటమిన్లే నా నరాలన్నీ పటుత్వంగా వుంచి యీనాటికీ యెలాంటి ఆపరేషనైనా యేమాత్రం అనిపిం స్తోంది!"

డాక్టరుగారి మాటలఫక్కీలో గోచరిస్తున్న పరిపూర్ణ హృదయంగూర్చి ఆలోచిస్తూనే సుందరం వింటున్నాడు.

"అమ్మ చనిపోయాక పెద్దమ్మాయి ఆలోటు తీర్చింది. చూడు, తెల్లవారేసరికి యెందరు బాధతో కాచుకూర్చుంటారు! నేను లేచేసరికి పూజగదిలో అంతా అమర్చేది. వంట మనిషిని లేపకుండానే అమ్మాయే నీరు మరగపెట్టేది. టిఫిన్, కాఫీ తెచ్చి దగ్గర కూర్చొని తినేటట్లు చేసేది. ఇంతడబ్బు తెచ్చేవాడినా, ఇంకో కూతురైతే నెలనెలా వందలుకూడబెట్టుకొనేది. ఏరోజు కారోజు లెఖ్ఖలు చూపిస్తూ వారానికి ఒక్కసారి 'నాన్నా! నాకై దురూపాయలు కావా'ల నేది. 'తీసుకో అమ్మా' అనేవాడ్ని. 'నీచేతులతో యివ్వాలి నాన్నా' అనేది. ఆడబ్బు గురించి నే నెప్పుడూ ఆలోచించలేదు. కాని యిచ్చేటప్పుడు యింత తక్కువా అనిపించేది. తరువాత నాకు తెలిసింది నాతల్లి నాపేరు చెప్పి బీదవాళ్లకు ధర్మం చేసేదట!"

డాక్టరుగారు కళ్లొకసారి నులుపుకొన్నాడు. సుందరం

శరీరం ఒక్కసారి గగుర్పాటు జెందింది. కుర్చీమీద సర్దుకొని మళ్ళీ మొదలుపెట్టారు.

“ఒరే బాబూ! అమ్మాయిపెళ్లి చెయ్యటమంటే నాగుండె కదలిపోయేది. కాని, ఆడవాళ్ల ప్రేమకు హద్దులంటూ వుండవు. నాతల్లి యెక్కడున్నా నాతల్లే— నన్నింకా హెచ్చుగా చూసుకుంటుంది. మాఅమ్మ కష్టకాలంలో కడుపు మాడ్చుకుంది. నేను గడించుకున్న రోజుల్లో యెవరికైనా చిరాకుగా యేమైనా అంటే అప్పుడూ పస్తుండి కడుపుమాడ్చుకొనేది. ఎప్పుడైనా ఒకసామెత చెప్తుండేది. ‘పెద్దచెట్టుకన్నా వంగిన తుంగదుబ్బే గెలిచిందిరా!’ అని. అమ్మాయి పెళ్లినాటికి అమ్మ లేకపోయినా అమ్మ సామెతమాత్రం నే బ్రతికినంతకాలం మరచిపోలేను”

డాక్టరుగారు ఆగారు. తల్లీ కూతురూ దేనికో ఆతురత పడుతున్నారు. డాక్టరుగారు వాలుకుర్చీమీద చారబడి మళ్ళీ మాటలు పొడిగించారు.

‘లక్షలు గడించాను. వేలు ఖర్చుపెట్టాను. కాని మర్యాదను గడించలేదు. మాఅమ్మ గడించి నాకిచ్చింది. ఎవరింట్లో మాఅమ్మ తవుడు తెచ్చి గంజి తాగిందో వాళ్ల గురించి చనిపోయేముందు చెప్పింది.‘ వాళ్లభూములు కొన్నావు. కాని వాళ్లవల్లనే నివ్వింతవాడి వయ్యావు. వాళ్ల నొకకంట చూడు బాబూ!’ అంది. ఒకసారి ఆవూరు అమ్మవున్నరోజుల్లో నే వెళ్లేటప్పుడు వాళ్లింటిలో ఒక కుర్రాడ్ని చూశాను. అప్పటికి ఎనిమిదవతరగతి చదువుకున్నాడు. ప్రతిసంవత్సరం ఫస్టుగా పాసవుతున్నాడట! చదించటానికి శక్తిలేకపోవటంవల్ల ఆసంవ

త్వరంతో మానిపించేస్తామన్నారు. 'సరే, నేను నెలనెలా డబ్బు పంపిస్తాను. కుర్రాణ్ణి పాడుచెయ్యొ' ద్దన్నాను. ఆకుర్రాడు యింటర్ మీడియేట్ కి వచ్చేవరకూ నేను చూడలేదు.

"పొలాలు చూట్టానికి వెళ్లేసరికి 'కుర్రాడు శలవుల్లో వచ్చాడు. ఎక్కడో గుమస్తాగా వేస్తే నాలుగురాళ్లు సంపాదించుకుంటాడు. చదువు మానిపించేస్తా' మన్నారు. కాని అ కుర్రాణ్ణి చూశాక నా కేదో ఆశకలిగింది. ప్రతిసంవత్సరం ఫష్టుగా పాసవుతున్నాడు! వచ్చేముందు అన్నాను. 'మీరు మా దగ్గరవాళ్లే. మానాన్న చచ్చిపోతే మీ యింట్లో నే పాలిచ్చి నన్ను పెంచారట! సత్యంకు మాపెద్దమ్మాయిని యివ్వాలనివుంది. మీరువొప్పుకోవా' లన్నాను. 'మీతో సంబంధం చెయ్యటానికి తాహతు చాలదు బాబూ!' అన్నారు. 'తాహతులెత్తితే మీయింట్లో యిలాగే వుండిపోతాను మీదగ్గర నేర్చుకోవలసిన మర్యాద యెంతైనా వుంది. మనిషి తాహతు చెప్పేది మర్యాదకాని, డబ్బుకాదు. ఇలా అనేసరికి ఆయన వొప్పుకున్నారు. ఆపిల్లడికి సంబంధం స్థిరం చేసుకొచ్చానంటే 'నాకూతుర్ని కడుపుకు గంజి నీరు లేనింట్లో పారేస్తారా? అని తల బాదుకొని యేడ్చింది ... ఇదిగో ఇక్కడే వుంది. కావలసి వస్తే అడుగు. వారంరోజులు నాతో మాటలుకూడ మానేసింది! నిరుడు కేన్సరైతే మద్రాసు తీసుకవెళ్లి మూడునెలలు సెలవుపెట్టి సేవచేసి యే అల్లుడు బ్రతికించాడు? ఏపండక్కయినా నేను పిలవాలనిలేదు. ఇంట్లో వాడిలా బుద్ధిపుట్టినప్పుడు వస్తాడు. చూసిపోతుంటాడు. నా కిదివ్వలేదని అదివ్వలేదని అడుగుతాడా? అదీలేదు. నవ్వులబండి. పెద్ద యింజనీరా! ఇప్పటికీ

నా యెదురుగా సిగరెట్ కాల్చేడు! ఏమడులూ మాన్యాలు చూసి ఆసంబంధం చేశాను!! మడులూ మాన్యాలు వున్నా మర్యాద లేనివాళ్లకు పిల్లనిస్తే మనకెంత అప్రతిష్ఠ! మొన్న రెండో అల్లుడు యేంచేశాడు! పెళ్లినాడు నేనిచ్చిన వాచీకి రిపేరువచ్చిందని బాగుచేసి పంపించమని పోష్టులో పంపించాడు!!

"నా కిష్టం లేదనమ్మా అని, యిదేకాదు వీళ్ల చుట్టాల నందర్నీ తెప్పించి మరీ నేర్పించింది కూతురికి. కాని నాతల్లి 'నాన్న యిష్టపడితే నాకూ యిష్టమే' అంది. బాబూ! అమ్మాయి తనచేతులతోనే డబ్బు పంపించి మొగుడ్ని చదివించింది! చల్లని చేయి కాబట్టి మొగుడు యింజనీరై కూర్చున్నాడు! దాని కేం లోటిప్పుడు? ఇప్పటికీ యేమైనావస్తే నాన్నసలహా తీసుకోనిది యేమీ చెయ్యదు. అదే మొన్న పెద్దకూతురుపెళ్లి చేసేటప్పుడు పెద్దసంబధాలొస్తే మానాన్న యిష్టమంది. నేను మాకు దగ్గరవాళ్ళే—కాస్త చితికిపోయారనుకో—చదువుకుంటున్న వాళ్ల కుర్రాడ్ని తెచ్చి పెళ్లిచేసి పెద్దవాడ్ని చేసుకో అన్నాను. ఆపెళ్లికి మిగతావాళ్లందరికీ కోపం వచ్చింది. నా మీద అలకసాగించారు. రోగి అలిగాడంటే నా పంచప్రాణాలూ పోతాయిగాని, ఇలాంటివాళ్ళెందరు అలకసాగించినా నేను నేనేలే. అల్లుడు మనగుండెల్లో మేకవడానికికాదు. మనవాడై కందుకు మన కష్టసుఖాలుపంచుకుంటాడనేగా చేసుకుంటాం! ఏదో వున్నవాళ్లు పేదవాళ్లని పైకెత్తకపోతే జాతికే కళంకం గాదురా!"

ఆగదిలోనికి పెద్దపెద్ద ఆఫీసర్లు, పేరుప్రతిష్ఠలుగల బంధువులు, స్నేహితులు వచ్చారు. ఆ పేముకుర్చీమీద వందలకొద్దీ

కూర్చున్నారు. కాని. ఒక్క సుందరంకు తప్పించి యింకెవరికీ అలాంటి మాటలు వినేభాగ్యం కలగలేదు.

'రైలు యీసరికి వచ్చేస్తుందేమో!' అంది. చిన్న కూతురు శాంత.

'అయితే అన్నారు?' డాక్టరుగారు పక్కకుతిరిగి.

'మా తమ్ముడు వస్తున్నా డని మరచిపోయారా?' అంది నరసమ్మ.

'అదంత జ్ఞాపకం వుంచుకోవలసిన విషయంకాదే?'

'ఎందు కుంటుంది? మాతమ్ముడికి మీరువెళ్లి కలుసుకోకపోతే పోయే దేమీలేదుకాని...వాడికేం...?'

'సరి! ఇంకా యింటికి రానివాడికి మర్యాద చెయ్యటానికి మీరంతా ఎదురెళ్తున్నారు. ఇంట్లో వున్నవాళ్లకి మర్యాద చెయ్యనందుకు తల్లీ పిల్లలకు సిగ్గుపుట్టడంలేదూ? చూస్తున్నాగా...బలవంతాన యింట్లో వుండరా బాబూ అని తెచ్చిపెట్టే వేళకు కాఫీ భోజనం పెట్తున్నారా? వంటమనిషి పెట్తే వుంది లేకపోతే లేదు!'

'బాబూ' అన్నాడు సుందరం- కాస్త వుద్రిక్తంగా వచ్చే డాక్టరుగారి మాటలకు అడ్డుగా—'ఈయింటిలో మర్యాద లేదని మెవరన్నారు?'

'సరే! నివ్వలా తీసుకోకపోవచ్చు. నీదారివేరు. నిన్ను చూసి సిగ్గు తెచ్చుకోవాలి. ఆడపిల్లలున్నారే, పొద్దెక్కేవరకూ లేవరు. లేచినా ఒకపూజా, పురస్కారమా? యేమీ లేదు. పెద్దమ్మాయి వెనక పుట్టినందుకు కొంతలో కొంతైనా ఆ గుణాలు అబ్బాయికావు?'

మాటాడకుండా నరసమ్మా, శాంతా అక్కడనించి వెళ్లిపోయారు. కొంతసేపు డాక్టరుగారు మాటాడలేదు. సుందరం కాలిబొటనవేలు నేలకు నొక్కుతూ తలదించి చూస్తున్నాడు.

'ఈవచ్చేవాడు డెప్యూటీకలెక్టరోయ్! మూడోఅమ్మాయికే యీాయనే సంబంధం తీసుకొచ్చి ఐదువేలుకట్నం యిప్పించాడు ఒరే బాబూ! మనుషులరోగాలు కుదిర్చేవాడ్ని నన్ను రోగిష్ఠిని చేద్దామని వీళ్ళందరి ప్రయత్నం. ఆఐదువేలు తప్పించి ఒకదమ్మిడీ ముట్టచెప్పలేదు. నిర్మొహమాటంగా వాళ్లేకట్నం పిండకపోతే నామనస్ఫూర్తిగా పదివేలిచ్చేవాడిని......సరే యెవరి అదృష్టానికి యెవరుకర్తలు? ఈ డెప్యూటీకలెక్టరు యీజన్మలో డెప్యూటీకలెక్టరవుతా ననుకున్నాడా? అప్పటిలో వాడిలోవున్న వినయం లేశమంతవుంటే యెంత బాగుండేది? మనిషి సింహాసనం యెక్కినా పాతరోజులు మరచిపోకపోతే మనిషి మనిషనిపించుకుంటాడు. డిస్ట్రిక్టుకలక్టరు కేంపుకు వచ్చాడు. జబ్బుచేస్తే బాగుచేశాను. ఆపరిచయంమీాద గుమస్తాగా మగ్గుతున్నవాడిని పైకెత్తించాను... .చేసినమేలు చెప్పుకోకూడదు కాని, వీళ్లంతా యెక్కడో సుఖంగా వుండటమే నాక్కావాలి...!' జేబు గడియారం చూస్తూ లేచి పోయాడు.

3

డాక్టరుగారు నాలుగో కూతురి పెళ్లికూడా వచ్చిన చుట్టపక్కాలు, విన్నవారుకూడా ఆశ్చర్యపడేటట్లు చేశారు.

పెద్దకూతురుపెళ్లి చేసేటప్పుడు రెండువేపుల ఖర్చులూ

భరించి బ్రహ్మాండంగా చేశారు. రెండో అమ్మాయి పెళ్ళికి మగ పెళ్ళివారు మర్యాదలు జరుగలేదని అలకసాగిస్తే బ్రిష్ పట్టుకొని విడిదికి పెళ్ళి మొదట వియ్యంకునిబూటు బ్రిష్ చెయ్యటం మొదలెట్టారు. జరిగిన కోలాహలమంతా చూడనట్టే చివరకు 'బావగారూ, మీరంతా ఆఫీసర్లు! బంట్రోతులచే బూట్లుకూడా తుడిపిస్తేగాని మీకు తృప్తి వుండదు......కార్యం చేసినాడూ బంటోతే కదా! ఇంకా యేంచెయ్యాలో శలవియ్యండి' అన్నారు.

మూడో అమ్మాయి పెళ్ళికి ఐదు వేలు కట్నం అని నిర్మొహమాటంగా అడగటంతో ఆ అయిదు వేలూ తప్పించి ఒక్క దమ్మిడీ హెచ్చు యివ్వలేదు. అల్లుడికి మోటారుసైకిలు కావాలంటే ఆ అయిదు వేలలోనే కొనుక్కోమని చెప్పారు. వాచీలంటే' నీజీతంలో ఒక నెల బేంకులో వెయ్యకుండా కొనుక్కో బాబూ!'అన్నారు. అడగని పెళ్ళికొడుక్కు చెప్పి అడిగనివారి ముఖాలు ముడుచుకోనిచ్చారు.

ఇప్పుడు నాలుగో అమ్మాయి పెళ్ళికి పెద్దగలాటా జరిగింది. డబ్బు ఖర్చుపెట్టారు కాని, పెద్దరికం సుందరంకిచ్చారు. పెళ్ళికుమారుడికి కట్నాలూ కానుకలూ వర్షిస్తుంటే యింత పేరుప్రతిష్ఠలున్న డాక్టరుగారు పిల్ల యెదురుగా వుంచిన పళ్ళెరాన్ని బోర్లించి నిల్చొని 'మీరంతా వచ్చి నన్నానందింపజేసినందుకు కృతజ్ఞుడ్ని...అ' ంటూ చేతులెత్తారు.

రాధతో అత్తవారింటికి పెద్దమ్మాయీ ఆమెభర్తా వెళ్ళారు.

ముడుకులు దిగని పంచెతో మీసాలు పండిన పెద్ద వియ్యంకునితో ఆరాత్రిభోజనానికి కూర్చొని యేవేవో కుటుం

బవిషయాలు మాట్లాడుకుంటున్నారు. పెళ్లై నాలుగురోజులైనా ఆగోడవలింకా సుందరంమీద పడివుండటంచేత యింకా భోజనానికె రాలేదు. ఈవేళ శాంత వడ్డనకు వచ్చింది. అన్నం కలుపుతూ 'మీ అమ్మను ఒకసారి పిలమ్మా' అన్నారు.

శాంత వెళ్లింది

"అయితే, బావగారూ! అల్లుడు అమ్మాయిని పంపించకపోయినా, వ్రాసినవుత్తరాలకు జబాబులైనా యిస్తాడా?" మధ్యను ఆపిన విషయాన్ని మళ్లీ లేవనెత్తారు.

"అదీ లేదండి బావగారూ! ఏం అదృష్టమో? లక్ష్మిదేవిలాంటి కోడలున్నందుకు..."

"పోనీ మీమీద కోపమైనా...భార్యాభర్తలు పొత్తుగా వుంటారా?"

"దానికేం లోటు లేదండి! ఆడపిల్లకదూ—మాఅందరికీ చూడాలని వుంటుంది. మీచెల్లెలకుమాత్రం విచారంలేదు. ఎక్కడో సుఖంగా దానిబ్రతుకది బ్రతికితే చాలంటున్నది"

"మీ చెల్లెలకు మేడుపు యిట్టే వచ్చేస్తుంది—"

ఈమాటలు అప్పుడే వస్తున్న నరసమ్మ చెవిలో స్పష్టంగా పడ్డాయ్.

"నే నెవరిగురించి యేడవాలన్నయ్యా? ఏం కొడుకులు పోయారని. నలుగురూ ఆయనమీద విరుచుకపడితే ఏడవనూ?"

పెద్దవియ్యంకుడేమీ మాటాడకముందే "నామెదురుగా యేం అనలేదే? ఏం అన్నారేమిటి?"

"ఏం అంటారు బావగారూ? వాళ్లకు తోచిన అభిప్రాయాలు యిచ్చుంటారు" అందుకున్నాడు వియ్యంకుడు.

"బావగారూ! ఈఅభిప్రాయా లివ్వటం ప్రతివాడికీ ఒక జబ్బయిపోయింది. మనిషితో మాటాడకండా అభిప్రాయా లిచ్చేస్తారు! చూశారూ...అర్థంలేకుండా ఊతపదాలు వాడి మాటాడితే ఎంత అసహ్యంగా వుంటుందో, ... అర్థంలేకుండా అభిప్రాయాలు యిస్తే మనబ్రతుకూ అంత అసహ్యం అయిపోతుంది...లోటేమైనావుంటే యెదురుగాఅనాలి గాని ఇదిచ్చారు కాదు అదిచ్చారుకాదని..."

"వాళ్లుఅంటే అన్నారు. అయినా వాళ్ల హోదాకి తగ్గట్లు మనం యేం యిచ్చాం—యేం చేశాం?"

నరసమ్మ అందుకుంది—

"ఇంకేం యివ్వాలి? వాళ్ల బ్బాయిని చేసుకున్నంత మాత్రాన వాళ్ల కాళ్లు పట్టాలనిలేదే!"

"ఆడపిల్ల నిచ్చుకొనేవాళ్లు యిలానే అనుకుంటారు!!"

"మ రెలా అనుకోవాలి! చేసిందిచాలు. వందలు ఖర్చు పెట్టినా వాళ్లను సంతోషపెట్టలేం! ఈఅన్నం పెట్టకపోయినా యీ బావగారు నవ్వుతూనే యీయింట్లో తిరుగుతారు. సరా! మీతమ్ముడింకేం చెప్పాడు?"

నరసమ్మ యేమీ సమాధానం యియ్యకుండా గుమ్మా న్నానుకొని అలానే నిలుచుంది.

"కుచ్చిటప్పాలు కొట్టుకొని, పేకాటలు వేసుకొని తందనా లాడారుగాని. యేమైనా సహాయం చేశారా వీళ్ళంతా?"

"ఎవర్ని చెయ్యమని అడిగారని?"

"అడిగితే యెవరైనా చేస్తారు. ఇది నాది అని కలుగ జేసుకొని సుందరంతప్పించి యింకెవరైనా చేశారా?"

"ఈకాలానికి వాడోదగ్గరివాడు దొరికాడు!"

"అవునే. దగ్గరివాడేనే!" బావగారివేపు ముఖంతిప్పి "అదేం ఖర్మమోగాని, మనిషివిలువ డబ్బుచూసే కట్టుందండి! ఆ సుందరంతల్లిని తలుచుకుంటుంటే మాఅమ్మ జ్ఞాపక వస్తుంటుంది. నాలానే కష్టపడి చదివాడు. స్కూలుఫైనలుతో మానేస్తా నన్నాడు. బి. ఏ. పూర్తికానీరా అన్నాను. ఇంటర్ పూర్తిచేసి పెళ్లియీడువచ్చే చెల్లెలుందని వుద్యోగంలో ప్రవేశించాడు. రెండేళ్లయింది. మొన్ననే చెల్లెలిపెళ్లికూడాచేశాడు. వాడుగొప్పవాడంటారా? లేక పెద్దవాళ్లు చదివించి, పెళ్లి చేసి వుద్యోగంలో వేయించాక కబుర్లుచెప్పే వీళ్ళంతా గొప్పవాళ్ళంటారా! బదిలీమీద యీవూరువస్తే బలవంతాన యింట్లో తెచ్చిపెట్టినందుకు నాపరువు యేం నిలబెట్టారు?"

ఈమాటలన్నీ విననట్టే నరసమ్మ "నన్నెందుకు పిలిపించా" రంది.

"ఈయింటి యిల్లాలివని..."

డాక్టరుగారి యీమాటలధోరణి వియ్యంకుడికే కాదు, శాంతనూ, వంటమనిషినీకూడా ఆశ్చర్యచకితులను చేసింది.

"కాళ్లుపట్టుకుంటే తన్నేవాళ్లకోసం యెందుకు పాకులాడుతావు? పిల్లలమీద నీకెంత అభిమానమో నాకూ అంతే వుంది. నివ్వొచ్చి వాళ్లని చేతకానివాళ్లని చెయ్యక—ఈబావగారిలాంటి వాళ్లని కష్టపెట్టడం నాకిష్టంలేదు. అందుకే పిలిపించాను ..ఇక వెళ్లొచ్చు!"

ఈమాటలు రాల్చటంలో వుద్రేకపుచిహ్నాలు కొద్దిగా అగపడ్డాయ్. నరసమ్మ కొంతసేపటికిగాని మాటాడలేక పోయింది.

"ఇదంతా యెవరిది? మీరు చెప్పకపోతే నాకింకెవరు చెప్తారు? మీకంటే నాకింకే దేవుడున్నాడు?" అంటూనే నరసమ్మ భోజనాలగదిలోనికి వచ్చింది. ఆమెగొంతుక చాలాదీనత్వాన్ని సూచిస్తోంది.

"నాదగ్గరే మీకు దాపరికమా? ఈ సంబంధం నాకిష్టం లేదని అంటే నేను కాదంటానా? నాకంటే సుందరం మీకు ఆప్తబంధువా? నాకూతురు యేడుస్తూనే అత్తవారింటికి వెళ్లింది! మీరు వాళ్లకి మర్యాదచెయ్యలేదనా? లేక మీకు అభిమానం లేదనా? చెప్పండి. నన్ను మీరు యింటియిల్లాలుగానే చూస్తున్నారా?"

ఎదురుగా కళ్లల్లో నీరుతో నిలుచున్న భార్యవేపు చూసి—"ఇందులో నాజోక్యం యేం వుంది! నీతమ్ముడూ నివ్వూ కలిసేగా చేసింది..."

"నాతమ్ముడు! వాడు హెచ్చా, మీరు హెచ్చా నాకు? ఐనా వాడెవరివల్ల అంతవాడయ్యాడు! మీరు కళ్లెత్తి చూస్తే వాడెక్కడుంటాడు? ఏదో గొప్పసంబంధం వుందంటే చూస్తాం అన్నానుగానీ, మీతో చెప్పకుండా చేస్తానా? ఆమాత్రం చెయ్యటానికే నాకు అధికారంలేదా? మొన్న పెళ్లిలో కానుకలేవీ పుచ్చుకోవద్దని చెప్పి పంతం నెగ్గించుకున్న సుందరం పాటైనా చేశానుకానా?"

"చేశావు కావు" అంటూనే పీటమీదనుంచి లేస్తూ "ఈవేళలా యిదివరకు మాటాడివుంటే ఒకరితో పోల్చుకొనే అవస్థ నీకుపట్టేదికాదు. ఇకమీదనైనా నీమొగుడు అంబలి జారీవాడని జ్ఞాపకంవుంచుకొని వచ్చేచుట్టాలకు మర్యాదచేస్తే యీయింటి యిల్లాలి వౌతావు."

ఈమాటలు పూర్తికాకుండానే సుందరం భోజనానికి వచ్చాడు. "ఒరే బాబూ! భోజనంచేసినవెంటనే పడుకుంటావు. అదిచాలా చెడ్డఅలవాటు." సుందరం చిన్నవవ్వు నవ్వాడు.

నరసమ్మ అక్కడనుంచి వెళ్ళిపోయింది డాక్టరుగారు మెల్లిక్కుతూ బిగ్గరగా అంటున్నారు—"ఈకాలం కుర్రవాళ్ళకి ఆరోగ్యానికి సంబంధించిన చిన్నవిషయాలు తెలియకపోవటంచేత పెద్ద జబ్బులు తెచ్చుకుంటూ రండీ బావగారూ!"

సుందరం పీటమీద కూర్చొనే చెవులు రిక్కించి వింటున్నాడు. వడ్డించిన శాంత గోడ నానుకొని నిలుచుంది. మామూలుధోరణిలో తలదించుకొనే భోజనానికి మొదలుపెట్టాడు.

శాంత నాలికచివరకు వచ్చిన మాటలను ఆపుకుంది. కాని ఆవిషయాన్ని స్పష్టంచేసుకోవాలనే వుబలాటం మాత్రం పోలేదు. నరసమ్మ వంటమనిషితో కలిసి కళ్ళు నులుపుకుంటూ భోజనానికి రావటంతో శాంత అక్కడనుంచి కదిలింది.

౪

ఏప్రిల్ నెల యెండచూపు చల్లారింది. ఆసాయంసమయాన ఆగిఆగి వీచేగాలుల తాకిడికి మెల్లగా కదిలే పూల మొక్కలమధ్య కుర్చీ వేసుకొని కూలబడ్డాడు. అప్పుడే ఆకా

శాన నడినెత్తిమీద యిటూ అటూ కదిలే మేఘాలమల్లే సుందరం తలలో ఆలోచనలు పరుగులెత్తుతున్నాయ్!

హృద్యమైన ఆప్రదేశంలో, ఏవో తియ్యని కోరికలను ప్రేరేపించే కమ్మని వాతావరణంలో యీ మొడతెగని ఆలోచనలకు హద్దులేకుండా పోయింది...నడినెత్తినవున్న మబ్బులు మెల్లగా కదిలిపోయాయ్! వెన్నెల ప్రకృతికి ఒక శోభాయమానమైన అలంకారంవలె ప్రకాశించి వన్నె తెచ్చింది. సుందరం మనసులో తిరిగే ఆలోచనలవల్ల పొందే అనుభూతి వలన ఒక్కొక్కసారి శరీరం గగుర్పాటు చెందుతోంది—ఈప్రపంచంలో ఒక నిరుపేదకు, ఒక లక్షాధికారికి యేమిటి సంబంధం?... చివరకు యీ సరిపోల్చుకోవడాలు విడ్డూరంగా అగపడ్డాయ్. ధనకనక వస్తువాహనాలతో నిమిత్తం లేకుండా అందరియందు మనోవాక్కాయకర్మలతో అభిమానాన్ని చూపించటం గొప్పవాళ్ల లక్షణం. తను చదువుకున్న బడిలో తనొక్కడే డాక్టరుగారివలన సహాయం పొందేవాడనుకొనేవాడు కాని ఐదవ లేదికల్లా తనకు వచ్చినట్లే మరొక ఐదుగురికి డాక్టరుగారిదగ్గరనుంచి మనియార్డర్లు వచ్చేవని కొన్నాళ్లకుగాని తెలిసిందికాదు. దానం, ధర్మం లోకంకళుకప్పడానికి చేశాడంటే అదీలేదు. తను ఆర్థికంగా సహాయంచేస్తున్నానని యెవరితోనైనా చాటుకతిరిగితే ఆనాడే తనకు ద్రోహంచేస్తున్నట్లు భావించమని అన్నాకే యీడబ్బు పంపించేవాడు.

ఈఆలోచనాప్రవాహం శాంత అప్పుడే యెక్కడనుంచో రావటంవల్ల అరికట్టబడింది. శాంత సరాసరి చరచరా యింటిలోనికి వెళ్లిపోయింది. సుందరం లేచి నిలుచున్నాడు. ఒకసారి

యిటూఅటూ అక్కడే పచారుచేశాడు. నరసమ్మ యింకా రాలేదు. అప్పటికి యింటిలో శాంతా, వంటయింటిలో వంట మనిషీ తప్పించి యింకెవరూలేరు.

సుందరం శాంత గదిగుమ్మం దగ్గర నిలుచున్నాడు. ఆమె అద్దంలో ముఖం చూసుకుంటోంది. సుందరం చూపుడువేలితో తలుపుతట్టి చిన్నచప్పుడు చేశాడు. శాంత గుమ్మంవేపు చూసింది. ఆమెవేపు చూడకుండానే, 'ఒకసారి యిలావస్తారా?' అన్నాడు.

"ఎందుకూ?"

"మీతో ఒక విషయం చెప్పాలి." జంకూ గొంకూ లేనట్లుగా చెప్పాడు.

"ఏంటావిషయం!" కాస్త చిరాకును వ్యక్తపరచే కంఠ స్వరంతో అంటూనే గుమ్మంవేపు వచ్చింది.

"ఏమీ లేదు! ఈవిషయం కాస్త ఆలస్యంగా చెప్తున్నాను. అయినా ఫరవాలేదు. ఎవరైతే యీయింట్లో వుండమని బలవంతంచేశారో వారు పొమ్మనేవరకూ కదలను"

"ఓహో! బలవంతం?!"

"మీరు అనవసరంగా బాధపడవద్దని..."

"అయితే మాఅమ్మకూ చెప్ప..."

ఆమెమాటలకు హఠాత్తుగా అడ్డొచ్చి "ఆమెతో యీమాటలే చెప్పఖ్ఖర్లేదు. ఆమె యీకాలంమనిషికాదు."

శాంత నోరు ఆవలించింది. నాన్న ఆడినమాటలుకూడా బహుశః అప్పుడే జ్ఞప్తికి రావటంవల్లకామోసు ఆమె ఆలోచనలో పడింది.

"మానవనైజాన్ని మరమ్మత్తుచెయ్యటం అనుకున్నట్లుగా సాధారణంగా జరిగే విషయంకాదు. విసవిసలాడినా మీ అమ్మ మీతోనైనా మీనాన్నగారి గురించి చెడ్డగా చెప్పివుండదు... వస్తాను.''

ఈమాటలను స్ఫుటంగా, సహజశాంతంతో అన్నాక సుందరం ఆమెవేపు మళ్లీ చూడకుండా యెదురుగావున్న మేడ మెట్లు మెల్లగా యెగబ్రాకాడు.

ఈపలుకులలో కానవచ్చే సత్యాన్ని స్వీకరించేబదులు శాంత తనగురించి తానై ఆలోచించసాగింది. ప్రతిమాట లోనూ తను అవమానింపబడ్డానని అనుకున్నా, సుందరం మాటాడేటప్పుడు కనపరచే నిగ్రహాన్ని గంభీరభంగిమను మన సునుంచి వెంటనే తుడిచిపెట్టలేకపోయింది.

అక్క పెళ్లినాడు యెందరు ఆమెవేపు యేదో తెలియని బాధతో చూశారు! ఏదో పనికల్పించుకొని తనెక్కడుంటే అక్కడకు వచ్చేవారు. అక్కయ్యకంటే తనే పెళ్లిలో నలుగురి వల్లా అభిమానింపబడింది. అక్కయ్యే ఒకసారి 'నివ్వు చాలా అందమైనదానవే' అందే... ఈభట్రాజత్వం సుందరంలో కొంతలో కొంతయినా లేకపోవడంతో ఆమె కోరికోరి మన సులో అసహ్యాన్ని నింపుకుంది.

ఈసంఘటన జరిగిన మూడోరోజురాత్రి డాక్టరుగారు కేసుమీద ఏదో పల్లెటూరు వెళ్లటంవల్ల చాలారాత్రివరకూ సుందరం యేదో రాసుకుంటూ కూర్చున్నాడు.

మరుచటిరోజు మెళుకువచ్చేసరికి చాలా పొద్దెక్కింది. ఆదివారం ఆఫీసులేదని మంచంమీదే బద్ధకంతీర్చుకుంటుంటే

ఆయనకళ్లకి తెరచివున్న కిటికీగుండా డాబామీదవున్న శాంత కనపడింది.

జుత్తు విరబోసుకొని యెండలో నిల్చొనివుంది. లేచి కూర్చున్న సుందరం మనసు త్రిప్పుకోలేకపోయాడు. శాంత ముఖం పసుపురాసుకోవటంవల్ల పసిడి నిగ్గులను వెదజల్లుతోంది. ఆ అందమైన ముఖంమీద సూర్యరశ్మి పడటంవల్ల తళుక్ తళుక్ మని మెరుస్తోంది! నుదుట గుండ్రని కుంకుమ రేఖ — ఆ కాటుకకళ్లు చూడగానే సుందరం మనసును అదుపులో పెట్టుకోలేకపోయాడు. ఏదోమరచి వెఱచిన వాడిలా యిటూ అటూ ఆగదిలోనే పచారుచేస్తున్నాడు. రానురాను సుందరం కుడిచెయ్యి వణకటం ప్రారంభించింది. ఆచేతితో ఆమెముఖం కాస్త పైకెత్తి ఆకాటుకకళ్లల్లోనికి దీక్షగా చూడాలన్నంత ఆవేశం పుట్టుకొచ్చింది!

అలాంటి సమయాన శాంత సుందరంవేపు చూసింది. మళ్లీ చూడనట్లు ముఖం చప్పున త్రిప్పివేసింది. సుందరంకు తనవేపు చూసుకొనేసరికి యెందుకో సిగ్గువేసింది ఇంతసేపు తసెంచేస్తున్నాననే ఆత్మవిచారణ చేసుకుంటున్నా ఆమెవేపు చూడకుండా వుండలేకపోయాడు.

కొంతసేపట్లో ఆమెతనవేపేవస్తోందని అనుకొని గబగబ పరుపుమీద కూర్చుని ప్రక్కనేవున్న టేబిలుమీద పుస్తకాన్నితిప్పి దృష్టిపోనిచ్చాడు.

"మీదకు రాటానికే భయం వేస్తోం"దని గొణుక్కుంటూ పన్నని స్వరం రానురాను మందగించటంతో

నిల్చొని చూశాడు. శాంత అక్కడలేదు. ఆమాటలుమాత్రం మనసులో కదిలిపోతున్నయ్.

ఏదో ఆలోచిస్తూ కూర్చున్నా డాక్టరుగారు జ్ఞాపకానికి రావటంవల్ల లేచి క్రిందకు వెళ్లాడు. స్నానంచేసి మెట్లెక్కుతూ శాంతగదివేపు చూశాడు. ఆమె పరుపుమీద చారబడివుంది. కాలంకాని కాలంలో ఆకాశాన మబ్బులు కమ్మాయేమో... కిటికీగుండా వుండివుండి వుబికివుబికి దొంతరలుగా వీచేగాలికి తెల్లని పల్చనిచీరె మెల్లిగా కదులుతోంది. సుందరం వీటికన్నా శాంత కాటుకకళ్లకోసం ఆగాడు. ఆమె పుస్తకంతో ముఖాన్ని దాచి యింకా చదువుకుంటోంది.

కాళ్లీడ్చుకుంటూ మెట్లెక్కాడు. పంచెకట్టి బంగాలీషర్టు వేసుకొని మేడమెట్లమీద కాస్త చప్పుడు చేస్తూనే దిగాడు. శాంత పుస్తకం ప్రక్కకుపెట్టి చూడకపోడటంతో చాలా ఆశాభంగం కలిగిం దతనికి. ఇటూ అటూ చూశాడు. నరసమ్మ అగపడలేదు. గదిగుమ్మందగ్గర నిల్చొని "ఈ రెండు శరత్ రచనలు ...... చదువుతారా?" అన్నాడు ఆమెవేపు చూస్తూనే. శాంత చప్పున పుస్తకం దించి కూర్చొని కాటుక కళ్లల్లో మెరపు మెరపించి, కటువుగా 'అఖ్ఖర్లేదు' అంది.

ఈ తృణీకారంతో సుందరం అలా ఒకనిమిషం తలదించి నిలుచుండిపోయాడు. ప్రక్కకు తిరిగి 'అయితే' అంటూ పెద్ద దీర్ఘాన్ని తీసి—అడుగడుగు వేస్తూ వేస్తూ తరవాత ఒక్కొక్క మెట్టు మెల్లగా ఎక్కుతున్నాడు... ఈదీర్ఘమైన 'అయితే..' ను అనుసరించే మాట్లలకోసం చెవులురిక్కించివున్న శాంతమనసు ఆ ఒక్కొక్క మెట్టుమీదనుంచి ఒక్కొక్క పాదాన్ని అను

సరించి పోతోంది......ఆ మాటల్లో ఆవేళలా యేదో హృదయంలోదాగొన్న నగ్న సత్యాలు పైకొస్తాయనే ఆతృత ఆమెనలా చేసింది! కాని ఆవేళలా సుందరంమనసు స్థిరంగాలేదు. కాలు కాలిన పిల్లిలానో, దెబ్బదిన్న దుప్పిలానో అయి వెళ్లిపోయాడు.

శాంతమనసు ఆ అయి తేను అనుసరించే పదాలే కాకుండా ...ఆ కాటుక కళ్లకి మెల్లగా మీదికి పోతున్నప్పుడు కనిపించిన శాంతగంభీరమూర్తిని మళ్లీచూడా లనిపించింది. కోరికతో పాటు... ఆ చక్కని కిశోరికళ్లలో చల్లదనం— వదనంలో మూర్తీవించుటచేత వుబికి వుబికి వెంటాడే వయ్యారంతో మీదికివెళ్లింది!!

సుందరంవేపు చూసింది. ధ్యాననిష్ఠలోనున్న యోగీందునిలా పుస్తకంచదవటంలో నిమగ్నుడైపోయున్నాడు. ఏదో ఆలోచిస్తున్నట్లు నిల్చుంది...ఇటూ అటూ గదిలో ఆరిపోయిన జత్తును సర్దుకుంటూ తిరిగింది. అప్పటికీ తనవేపు చూడని సుందరాన్ని చూసి నాన్నపరుపుమీద దుప్పటి దులిపి పరిచింది. బీరువాతీసి తలగడగలేబా మారుస్తూ కళ్లనిండుగా ఆయనవేపు చూసింది. రాని దగ్గుకూడా తెచ్చుకుంది...కాని, సుందరం ఆమెవేపు చూడలేదు.

మనసులో వుప్పొంగే భావాలనూ, కోరికలనూ ఆపట్టున శాంత శాంతింపజేసుకోలేకపోయింది. ఒకయువతి నయనాలలో మరుగుపడ్డ మరునిభావాల బాధను ఆ నిముషంలో కోరిన యువకుని కళ్లల్లోని కళకళలే కొంతవరకు శాంతింపజేస్తాయ్!— ఆసమయంలో ఆమె ఆదర్శాలు, ఔన్నత్యాలు ససేమిరా,

జ్ఞాపకం రాలేదు. ఆమెకు కావలసిందంతా ఆనిముషంలో ఆయన ఆమెకు లొంగిపోవాలి.

సంధ్యలో యేర్పడే మెరుపువర్ణాల శోభవలెనే ఆఅనుభూతి మెంతసేపో ఆమెలోలేదు. సుందరం పుస్తకం అక్కడే వదిలి ఆమెవేపు చూడకుండా క్రిందికి వెళ్ళిపోవటంతో చీకటి అలముకున్న ఆకాశంలా ఆమెమనసైపోయింది!

శాంత నాన్నగారుపుమీద కూర్చుండిపోయింది. చాలా సేపటికిగాని ఆమెమనసు మళ్ళీ మామూలు గర్వంతో నిండి పోలేదు. ఆమెఆదర్శాలు ఔన్నత్యాలు అన్నీ జ్ఞప్తికిరాసాగినయ్......ఇంతసేపు తనిలా యెందుకయిపోయిందో ఆమెకే అర్థంకాలేదు! అమెచేసిన చేష్టలు జ్ఞప్తికిరావటంతో చిన్నతనం వేసింది —

౫

నరసమ్మ చివరమెట్టుమీద నిల్చుని మేడమీదకు చూస్తున్న శాంతవేపు చూసి 'అక్కడేవమ్మా నిల్చునావ్?' అంది.

"గదిలో సామాన్లు సర్దుదామంటే ....."

"ఇంకా కదల్లేదా? కదలమని చెప్పేవరకూ యిల్లువిడిచి పోయేటట్లు లేదులే..."

ఈమాటలు అంటుండగానే మెట్లుదిగి వస్తున్న సుందరం వేపు చూసింది. పక్కకు తప్పుకుంది. కాని శాంతకు అక్కడ నిల్చోటానికి సిగ్గుపుట్టడంచేత గదిలోనికి వెళ్ళిపోయింది. సుందరం తలవంచుకొని వెళ్ళిపోతోంటే నరసమ్మ కళ్ళుపెద్దవిచేసి అలాచూస్తూ నేవుంది.

శాంత కిటికీదగ్గర యినపగజాలు గట్టిగా పట్టుకొని సుందరం కనిపించేవరకూ చూసింది.

ఒకనాడు సాయంత్రం శాంత మేడమీద యేదో వ్రాసుకుంటూ అప్పుడే మీదికి వచ్చిన సుందరాన్ని చూసి చప్పున లేచింది.

"ఈ యింటికి మా అమ్మ రావచ్చా?" ప్రశ్నించాడు సుందరం. త నెందుకు యీప్రశ్న వేయవలసివచ్చిందో కాని, ఆమె చప్పున "రావటానికి వీల్లేదు. ఇష్టంలేకపోతే మీరు కూడా వెళ్ళిపోవచ్చు." చాలా తీవ్రంగానే అంది. మనస్సు చివుక్కుమనటంచేత గుటకలు మింగుతూ "నేనూ ఆదే ఆలోచిస్తున్నా" అన్నాడు నిల్చొనే.

"నాన్న కదలమనేవరకూ కదల నన్నారు?"

"అందుకోసమే నేనూ ఆలోచిస్తున్నా. మనిషి అమాయకు డైనంతమాత్రాన అత్మాభిమానం వుండకపోదు. అవిషయం తెలుసుకోలేనివాళ్ల దగ్గర యెందుకుండాలి?"

"ఓహో యెంత పెద్ద వాక్యం! అందుక నేనా అంతభక్తి!" సుందరం అలా తలదించుకొనే "మీనాన్న గారి విషయం, నావిషయం కాదు. నే మాట్లాడింది! మీవిషయం!!"

"మీజోక్యం అనవసరం"

సుందరం అక్కడనుంచి మారుమాటాడకుండా వెళ్ళిపోయాడు. శాంత మెట్లు దిగిపోతున్న సుందరం వేపు తొంగి తొంగి చూసింది. మళ్లీ కూర్చొని రాయాలనుకున్నా కలం ముందుకు సాగిపోలేదు.

ఆవేళ రాత్రి డాక్టరుగారు సుందరంకోసం చాలాసేపటి

వరకు చూసి సినీమాకు వెళ్ళిపోయివుంటాడేమోనని భోంచేసి మేడమీదకు పోయారు. తలనొప్పిగా వుండటంవల్ల నరసమ్మ మూలుగుతూ అప్పుడే నిద్రపోయింది.

శాంత గదిలో కిటికీదగ్గర కుర్చీ వేసుకొని వీధిలోనికి చూస్తోంది. అప్పటికి పది దగ్గరపడింది. వెన్నెల్లో సుందరం మెల్లగా తల దించుకొని రావటం చూసి ఆయన తలుపుతట్టకుండానే వీధితలుపు తీసింది.

"మీకోసమే... వేగిరం బట్టలు మార్చి భోజనానికి రండి" అంది మెల్లగా. ఆ గొంతుకలో అభిమానం వుట్టిపడుతుంటే సుందరం తనశరీరంవేపు చీకటిలోనే చూసుకున్నాడు!

భోజనంచేస్తూ శాంతవేపు ఒకసారి చూశాడు. ఆమె తలుపు నానుకొని నిలుచుంది. మళ్ళీతలదించాడు. శాంతప్రయత్నంమీద చాలాసేపటికి అంది— "శాంతం సహనం అంటా రే-సాయంత్రం అలా అయిపోయారేం?"

"అవును. అయ్యాను, మీరు పరీక్షకే అలా మాటాడానంటే అప్పుడుకూడా అలానే అయిపోయివుందును!"

శాంత కంతా అగమ్యగోచరమైంది. సుందరం ఒకసారి తలెత్తి చేతిలో అన్నంముద్ద పట్టుకొనే యేదో చెప్దామనుకొనే ఆమెవేపు దీనంగా చూశాడు. అన్నంముద్ద ఆకుమీద పారేసి తలదించి అన్నాడు: "మీపనిమనిషిలానే మాఅమ్మ నన్నూ నాచెల్లినీ పెంచటానికి ఒకరింట్లో పనిచేసింది. ఈవేళ పొద్దున్న మీరు మీపనిమనిషిమీద విరుచుకపడ్డట్లే ఒకనాడు మాఅమ్మ మీద ఒకావిడ విరుచుకపడింది. నాకు బాగాజ్ఞాపకం వుంది. ఆనాడు మాఅమ్మనన్ను, నాచెల్లిలిని పట్టుకొని బావురుమని

మేడ్చింది. ఈనాడుకూడా మాఅమ్మలా ఒకావిడ మేడ్చేవుం టుంది—” అంటూనే లేచి చెయ్యికడుక్కున్నాడు. వెళిపో తున్న సుందరంవేపు శాంత చూస్తూనే నిలుచుండిపోయింది.

౬

నరసమ్మను చూడటానికని వచ్చి నెలరోజులై ఆమె అక్క అక్కడే వుంది. శ్రావణమాసంలో నాలుగోకూతురు యింటికి వెళ్లాలనుకున్న నరసమ్మ తమ్మునియింటికి ప్రయాణం కట్టింది.

“సరే, వెళ్ళొచ్చు! నీ ముసలిమొగుడు యిక్కడ వున్నాడనిమాత్రం మర్చిపోకేం” అన్నారు చిన్ననవ్వుతో డాక్టరుగారు.

శాంత నవ్వేముఖాన్ని రెండోపక్కకు త్రిప్పుకొనేసరికి సుందరం నవ్వుముఖం యెదురైంది. ‘పిల్లవుంది’ అన్నట్టుగా సైగచేస్తూ నరసమ్మ నోరుమూసుకుంది.

“ఏం అమ్మా! అమ్మతో వెళ్తావా?” అన్నారు డాక్టరు గారు. ఆమె జవాబు చెప్పటానికి తటపటాయిస్తుంటే, “ఇంకో సారి వెళ్తుందిలెండి. ఈసారి నేనే వెళ్లొస్తా” అని నరసమ్మ అందుకుంది.

నరసమ్మ వెళిపోయింది. ఇంటిపెత్తనమంతా శాంతమీద పడింది. తెల్లారిలేవటం, పూజకు పువ్వులు, కాఫీ టిఫిన్లు అమ ర్చటం ఆమె చెయ్యవలసివస్తోంది.

“బజారుకు డబ్బు...” అన్నాడు సుందరం కొత్త మేనేజరమ్మ యెదురుగా నిల్చొని.

"మీ రెండుకూ..."

"సిగరెట్లకి రోజూలా డబ్బు మిగిలించుకోవద్దూ?"

ఈమాటలు సుందరం నవ్వుతూ అన్నా శాంతముఖం నల్లబడిపోయింది. చాలా కనికరంగా ఆయనవేపు చూసింది. పనిమనిషి మిగిలిస్తుందని, సుందరాన్ని బజారు తెచ్చేమనిషిని చేసి, సుందరం మిగిలిస్తున్నాడని వంటమనిషితో చెప్పేటప్పుడు అమ్మతో యేమని యెందుకు చెప్పాలనుకుందో, యెందుకు చెప్పలేకపోయిందో ఆమె తెలుసుకోలేకపోయింది!

ఆ మరుచటిరోజు డాక్టరుగారు పూజఅయ్యాక టిఫిన్ చేస్తున్నారు. ఎదురుగా కాఫీపెట్టి శాంతనిల్చుంది. ఒకగుక్కెడు కాఫీ మింగాక సుందరంవేపు తిరిగి "ఒరే బాబూ! మాచిన్న మ్మాయంటే నాకెంతో అభిమానం! ఎందుచేతంటావ్? మాఅమ్మ పేరూ శాంతమ్మే. నాచిన్నప్పుడు నన్ను పెంచి పోషించిందా? ఈ ముసలికాలంలో యీశాంతమ్మ పోషిస్తుంది" కూతురు వేపు తలత్రిప్పి "ఏం అమ్మాఅంతేనా?"

"ఇదేంటి నాన్నా—ని న్నొకరు పోషించాలా?"

"ఇదంతా నాదే అనుకొని నివ్వైనా యిట్లోవుంటా వని.."

శాంత ముఖందాచుకోటానికి చోటులేక పోవటంతో గబగబ యెదురుగా చారవేసివున్న కిటికీరెక్కలు తెరవటానికి వెళ్లింది. శాంతముఖం నాన్నవేపు త్రిప్పేసరికి నాన్నకాఫీ పూర్తయిపోయింది.

"ఒరే బాబూ! నే చెప్పినట్లు ఆపెద్దకూతురువింది. దాని కేం లోటొచ్చింది చెప్పు. చిన్నమ్మాయిమీదా అలాంటిఆశే

వుంది —ఏం అమ్మా—మీ రెండో అక్కలా మీఅమ్మమాట వింటావా? లేక మీపెద్దక్కలా నామాట వింటావా?"

శాంత పొందుతున్న పరిపూర్ణానందంతో చప్పున "నీమాటే నాన్నా" అంది సిగ్గునభినయిస్తూ. సుందరం నోరు ఆవలిస్తే శాంత తల దించుకుంది...

సుందరం లేచి క్రిందికి వెళ్లాడు. కొంతసేపయ్యాక తిరిగి వచ్చేసరికి తండ్రీ కూతురూ మేగోడవలో మాటాడుకుంటు న్నారు. ఆమాటలు వినకుండా వుండాలని టెరేస్ వేపు వెళ్లాడు. ఎండలో నిల్చొని యేదో తెలిసి తప్పుచేసినవాడిమల్లే అయిపోయాడు.

ఆలోచనలనుంచి బయటపడి చూసేటప్పటికి డాక్టరుగారు ఆయనవేపు చూస్తుండటం గమనించాడు. తనవికారకళలను ఆయన చూశారేమోనని బాధపడ్డాడు.

డాక్టరుగారు వెళిపోయారు. శాంత అంతకుముందే అక్కడనుంచి వెళిపోయింది. ఆఫీసుకు టైము కాకపోయినా బట్టలువేసుకొని మెట్లుదిగుతుంటే శాంత యెదురైంది. ఆమె వేపు చూడనట్లుగానే వెళిపోతూంటే—

"ఆఫీసుకు కాదనుకుంటాను..."

"కాస్త అర్జంటుపనుంది అనుకుంటూనే సుందరం వెళి పోతోంటే "తోటలో పువ్వులేమీలేవు. వచ్చేటప్పుడు తెస్తారా?" అంది.

'హాఁ' అన్నాడే గాని, మనసులో యేదో అనుకొనే వెళ్లిపోయాడు.

ఆవేళ ఆఫీసునుంచి ఆలస్యంగా యిక్కడా అక్కడా అర్థం పర్థంలేకండా తిరిగాక వచ్చాడు. డాక్టరుగారు తనకోసమే చూస్తున్నారు. శాంత, సుందరం డాక్టరుగారికి చెరో వేపు నడుస్తూ ఆయనచెప్పే కబుర్లువింటూ సినీమాథియేటరు చేరారు.

సినిమా విడిచిపెట్టాక జట్కా యెదురుగా నిల్చింది. శాంత మొదట కూర్చుంది డాక్టరుగారు యెక్కుతారని కాస్త తప్పుకొనివున్న సుందరం వేపు చూస్తూ, 'యెక్కరా బాబూ' అన్నారు చేతికర్ర వూపుతూ, సుందరం కూర్చున్నాక చివరకు డాక్టరుగారు కూర్చున్నారు.

శాంత రెండుజడలు ముందుకు వేసింది. సుందరంముఖం యెదురుగావున్నా ఆమెచూడలేదు. పువ్వులు తేనందుకు సంజాయిషీ చెప్పుకోకపోవటం అటుంచి సుందరంముఖం వుదయం నుంచీ అదోకలా వుండటం ఆమెకుకష్టంగానేవుంది. అమ్మయేదో అన్నప్పుడుకూడ నవ్వుతూనే వెళిపోయేవాడు కాని, యీవేళ ఆసిగ్గుతో కూడిన నవ్వు సుందరం ముఖంలో లేకపోవటంతో ఆమెకు యెవరిమీదనో అలకసాగించాలన్నంతకోపం వచ్చింది!!

డాక్టరుగారు స్వీయచరిత్ర మొదలు పెట్టారు:

“నివ్వంటావు కాచుకోనే తాహతుందని. మా రాధమ్మ నాసైకిలుచూసి అసహ్యించుకోనేదిరా బాబూ. ఆ సైకిలుండబట్టే నేనూ వున్నాను—యీడబ్బు గడించాను...”

ఈ చరిత్రచెప్పే ధోరణి వినటానికి కుతూహలపడేవారికి కమ్మగానే వుంటుంది! కాని సుందరం సరిగ్గా వూకొట్టడంలేదు!!

ఇరవై యేళ్లపైనే అయింది! చచ్చిపోతాడన్నవాడికి చేతి డబ్బు పెట్టి మందులు, యింజక్షన్లుకొని బాగుచేశాను. వాడేం

చేశాడంటావ్—పాతసైకిలు, పెళ్లాం, ఐదుగురుపిల్లతోసహా మాయింటికి వచ్చాడు. కుర్చీమీద కూర్చున్నానేమో కాళ్ల మీదఅందరూ ఒకసారిపడి మొక్కేశారు.ఆసైకిలు పుచ్చుకొనేవరకూ విడిచిపెట్టారుకారు. ఆసైకిలు యేరోజునుంచి యెక్కానో డబ్బుఅలానే వచ్చిపడిపోయేది? చిన్న చిన్న సామానులు మార్చినా సైకిలు అదేనా? అదివుంటేగాని మనకి డబ్బురాదోయ్!!"

డాక్టరుగారు వ్యాఖ్యానిస్తూ చెప్పుక పోతున్నారు... టక్ టక్...శబ్దంచేస్తూ గుఱ్ఱపుబండి పోతూ యిద్దరిగుండెల్లో గడగడలాడిస్తోంది... 'ఎక్కరా బాబూ! అని బహు తేలిగ్గా అన్న డాక్టరుగారుమాత్రం మామూలుగానే వున్నారు! కాని ఆమాటలవల్ల లమనసుల్లో గాలిలో యెగిరే అకుల్లా ఆలోచనలు పరుగులెత్తుతున్నాయ్!!

సుందరం ఒకసారి శాంతవేపు చూశాడు. ఆ పువ్వులు లేని రెండు జడలుచూసి మళ్లీ ముఖం త్రిప్పి వూగుతోడున్నాడు. ఈసారి శాంత సుందరంవేపు చూసింది. గాలికి మెల్లగా ఆయ నజుత్తు మొనలు ఆడుతున్నయ్. సుందరం సర్దుకోబోయాడు.

కదిలేటప్పుడు ఆయనకుడిచేయి ప్రక్కనేవున్న శాంత కాళ్లమీద పడింది. గప్పున తీద్దామనుకున్నాడు. తీశాననుకున్నాడు—కాని తీయలేదు. నిముషంలోనే శాంతకాళ్లు తన చెయ్యిలానే వణుకుతున్నాయని గుర్తించాడు.

జట్కా ఆగింది. గుఱ్ఱపు టకటకలు లేవు—ఆ అనుభవం లోని లయకూడ దూరమైపోయింది. వాస్తవిక పరిస్థితులను

గుర్తించినవారు ఆశానిరాశలతో ఒక నిమిత్తమాత్రుని వెన
కాలే యింట్లోకి వెళ్ళిపోయారు!!

మరుచటిరోజు శాంతలేచేసరికి సుందరం స్నానం అయి
పోయింది. నాన్నపూజకోసం పువ్వులు తీసుక వెళ్లేటప్పుడు
సుందరం దీక్షగా యేదో పుస్తకం చదువుకోవటం గమనిం
చింది. కాఫీ తాగేటప్పుడైనా ఆమెవేపు చూడలేదు. ఇది
వరకు పొరపాటునైనా చూసేవాడు. 'ఈ వేళ అలాంటిపొర
పాటేమీ చెయ్యలేదు.

రాత్రి భోజనందగ్గర యేమీ అడగలేదు. వేసిం దేదో
తిని లేచిపోయాడు. నాలుగురోజులు యించుమించు యిలాగే
గడిచిపోగానే శాంత సుందరం గూర్చి యెందు కాలోచించాల
నుకుంది—ఐదోరోజు రాత్రి భోజనానికికూడ రాలేదు. చాలా
ఆలస్యంగా వచ్చి శాంతపెద్దమ్మతో "స్నేహితుని యింట్లో
భోంచేశాను" అన్నాడు.

రోజుకురోజూ సుందరం మార్పుకు శాంతచాలా కంగారు
పడింది. అమ్మతో వెళ్తావా అని నాన్న అడిగేటప్పుడు యే
ఆశ మనసులో పెట్టుకొని తటపటాయించిందో ఆ ఆశ నిరాశ
గానే మారింది.

అమ్మ రేపు వస్తుంది. సుందరంను యిదివరకే ఒకవి
షయం అడగాలనుకున్నా అడగలేకపోయింది. ఈవేళరాత్రి
ఆమెకు నిద్దరరావటంలేదు. ప్రక్కగదిలో పెద్దమ్మ అధ్యాత్మ
రామాయణకీర్తనలు పాడుకుంటోంది. నాన్న అప్పుడే యేదో
కేసుమీద బయటకు వెళ్లారు. నిముషనిముషానికీ శాంతమనసు
వుద్వేగంతో రెచ్చగొట్టబడుతోంది. మెల్ల మెల్లగా మేడమీ

దకు వెళ్లింది. సుందరంలేడు. డాబావేపు వెళ్లింది. వెన్నెల మసగ్గావుంది. ఒకమూల సుందరం కుర్చీమీద తలదించుకొని యేదో ఆలోచిస్తూ కూర్చొనివున్నాడు. దగ్గరగా వెళ్లాలనుకుంది కాని వెళ్లలేదు. కొంచెందూరంలో తల దించుకొని నిల్చుంది. చిన్న చప్పుడుకూడ చెయ్యకపోలేదు. సుందరం ఆమె వేపు చూసి మామూలుగా తల తిప్పేశాడు. ఈనిరాకరణ ఆమెకు చాలా అవమానంగా తోచింది. ఆ వెన్నెలరాత్రిలో యేం చెయ్యాలో తోచక బేజారెత్తింది. చివరకు వెనుకకు తిరిగినా ముందుకు అడుగు వెయ్యలేకపోయింది.

సుందరం లేచాడు. శాంత ప్రక్కచూపు చూసింది. సుందరం తల దించుకొనే వున్నాడు.

గొంతుక గురగురలనుంచే లేని కటుత్వాన్ని బలవంతాన తెచ్చుకొని "నా వేపు చూడకండి. నావిషయం మరచిపొండి"

ఈ కటుస్వరాన్ని వినగానే శాంత అడగాలనుకున్న విషయాన్ని మరచిపోయింది. తనెవరు? తనేంచేస్తున్నది? ఇలా అనటంలో ఆయనవుద్దేశం యేమిటి? తను ఆయనకోసం చచ్చిపోతోందా? దిగువపెదిమను పళ్లతో గట్టిగా నొక్కుకుంది. దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను తీస్తూనే చప్పున ముందుకు వెళ్లిపోయింది. నిద్రపోదామన్నా నిద్దర రావటంలేదు. ఆమె మనస్సంతా మండిపోతోంది. ఇంతనీచంగా తను ఒక ఆశ్రితునిచే తూలనాడబడుతుం దని యెన్నడూ అనుకోలేదు! రాను రాను ఆమెకు పెద్దపెట్టున తన అజ్ఞానానికి యేడవాలనిపించింది...

నరసమ్మ వచ్చాక కూతుర్ని చూచి "యీ పదిహేను రోజుల పెద్దరికానికే చిక్కిపోయావమ్మా" అంది. నరసమ్మ

చాలా వుత్సాహంగా వుంది. వచ్చినదగ్గరనుంచీ యీ కబురూ ఆకబురూ తెగచెప్తుంటే వినటానికి శాంతకు చిరాకుగావున్నా పూనొట్టి అభిప్రాయానిచ్చే అక్కవుందిగా!

ఆవేళ సాయంత్రం ఆయింట్లో పెద్ద గృహకలహం లేచింది. తిరుచెప్పేభారం నరసమ్మఅక్క వెంకమ్మమీద పడింది. డాక్టరుగారన్నారు "నాకు తెలుసు ఈ ఆడపెద్దరికాలు పీకమీదికి తెస్తాయని. నే వెళ్లేటప్పుడే చెప్పానే— యీముసలిమొగుడ్ని మరచిపోవద్దని నీకెవరు మాటిమ్మన్నారు? ఇప్పుడెవరేడవమన్నారు?"

నరసమ్మ తనమాట నిలబెట్టకపోతే యేనుయ్యో గొయ్యో చూసుకుంటానంది 'పో! నీఖర్మం నేనేం చేస్తా' నన్నారు డాక్టరుగారు.

ఈ మాటలతో భార్యకళ్లనిండా నీరు నింపటంచూసి వదినగార్ని వుద్దేశిస్తూ డాక్టరుగారన్నారు—"ఇదిగోండి మా శాంత పెళ్లి నాచేతిలోవుంది. నాయిష్టంవచ్చినట్లు మీరెవరూ కానివ్వపోయారంటే... యీయింట్లో ఒక్కనిముషం వుండమంటే వుండను—సరా!"

మేడమీద జరుగుతున్న యీ గందరగోళాన్ని శాంత అడుగుమెట్టుదగ్గర నిలబడి వింటోంది. నరసమ్మ నిష్ఠూరం మిళితంచేసి యేడుస్తోంది.

"ఈ కాలంపిల్లలు వినరంటావ్? నాకూతురే నామాట వినదంటావా? సరే! నీయెదురుగా చెప్పిస్తే!"

నాన్నగారి పిలుపువినిపించేసరికి శాంతకెందుకో భయంవేసింది. మెట్లెక్కుతున్నా ఆమెనరాలన్నీ పట్లుతప్పినట్లనిపించినయ్.

వచ్చీరావటంతోనే నాన్న అడిగారు "ఏం అమ్మా! నీపెళ్లివిషయంలో నామాట వింటావా? మీ అమ్మమాటా? ఇదివరలా 'నీమాటే నాన్నా' 'అని తేలిగ్గా అనలేకపోయింది. కాస్సేపటికి ముఖం దాచి "నీమాటే నాన్నా" అంటూనే మెట్లు దిగిపోతోంటే డాక్టరుగారు అన్నారు– "నాఅమ్మపేరూ నా పేరూ నిలబెట్టావే—ఇదంతా నీదేనమ్మా!"!

వదినగారివేపు తిరిగి—"ఇక చెప్పండి తీర్పు. మీచెల్లెలుగారు తమ్ముడిగారింటికి సంబంధంచేసుకురాటానికి వెళ్లింది. వాళ్ల డబ్బెవరి క్కావాలి? నాతలవొత్తిన పని చేసిందా? నేను యీ లోకంలో లేనే అనుకుంది!"

"రామ రామ! యెంతమాట" అంటూ వెంకమ్మ చెవులు మూసుకుంది! నరసమ్మ అక్కడనుంచి లేచివెళ్లిపోతోంటే—"ఏమయినా ఆడబ్రతుకు! ఆశాపాశాలు వుంటాయ్! ఏదో తొందరపడింది మీయిష్టం కాకపోతే యింకెవరియిష్టం పనికొస్తుంది?"

ఈ తీర్పుచెప్పి ఆమె మెల్లగా ఒక్కొక్క మెట్టు దిగిపోయింది.

కొంతసేపయ్యాక సుందరం వచ్చాడు. మెట్లెక్కుతూ శాంతగదివేపు చూశాడు శాంత రెండుచేతులతోనూ కళ్లు మూసుకొని వాలుకుర్చీమీద కూర్చొనివుంది. ఆమె అలసట చెందుతూ యేడుస్తోం దని గుర్తించాడు. ముందుకు వెళ్లటానికి మనసుపోలేదు. కాని, ఆమెదగ్గరగావెళ్లి మాటాడటానికికూడ ధైర్యం చిక్కలేదు ఎలాగో మేడయెక్కి డాక్టరుగారు తలపట్టుకొని కుర్చీమీద కూర్చొని వుండటంచూసి నిర్విణ్ణుడయ్యాడు.

సుందరాన్ని చూచి "కూర్చోరా బాబూ" అన్నారు చిన్ననవ్వుతో.

౭

మాఘం వచ్చింది. డాక్టరుగారు చిన్నకూతురుపెళ్లి యెంతవైభంగా చేద్దామనుకుంటున్నారో కావలసిన బంధువులు, ఆత్మీయులు యెక్కడకక్కడే యెదురుతగులుచున్నారు. ఎలాంటి దెబ్బలనైనా లోలోనే పాతిపెట్టి ముందుకు పోతున్నారు. పెద్దల్లుడు పెద్దకూతురు తప్పించి మిగతావాళ్ళంతా వుత్తరాలతోనూ మాటలతోనూ చిరాకెత్తించారు. కాని తప్పుడురొట్టెల సత్తువతో మనిషి స్తంభంలా నిలుచునే వున్నాడు.

నరసమ్మ తలమొత్తుకొని యేడిస్తే "నీమొగుడు మంచిపనిచేస్తే యేడుస్తావ్. చెడ్డపనిచేస్తే నీకు సరదా. అలాంటప్పుడు యిద్దరిలో ఒకరు ఛస్తేగాని యీయిల్లు బాగుపడ" దన్నారు.

పెద్దకూతురు మనసు వుండబట్టక "ఇంత తొందరేం వచ్చింది నాన్నా" అంది. "నా శాంతమ్మే కాదు అని వుంటే అప్పుడు యింటినుంచి వెళ్ళిపోయేవాడ్ని. ఏమైనా నివ్వాడవలసిన మాట కాదమ్మాయిది" అన్నారు డాక్టరుగారు చిన్నకూతురుకు వినిపించినట్లుగా.

ఇదంతా వింటున్న శాంతకు యెక్కడలేని భయం వేసింది. నాన్నదగ్గరకు వెళ్లి 'నాకీపెళ్లి యిష్టంలేదు నాన్నా' అని అనాలనుకుంది. కాని మళ్లీ ముక్కుమీదకు పౌరుషం వచ్చేసింది. పిడికిలు పట్టుకొని అసమయానికై వేచివుంది. బ్రతు

గంతా బూడిదపాలైనా తనుచెయ్యాలనుకున్న పని చేసితీరా లనే పంతంతో నిలుచుంది.

డాక్టరుగారు స్వయంగా వెళ్ళి పిల్చారు. పెద్దల్లుడు తప్పించి మిగతాముగ్గురూ రాలేదు. పోనీ కూతుర్లను పంపించ మన్నా అదీలేదు. భార్యపడుపు ఆపకపోవటం చూచిన డాక్టరు గారికి మొన్నదూరానంత కోపం వచ్చింది! కాని ముందుపరిస్థితి మనసులో పెట్టుకొని నవ్వుకున్నాడు!!

శాంతపెళ్లి అయిపోయింది. ఆమె మనసులో భయం కంటే కోపం, అహంభావం హెచ్చుగా నులుచుకపోతున్నాయ్. తనుఅక్క పెళ్లప్పుడు యెంతఅనుకుంది? అక్కమొగుడుకంటె యెంతోఅందగాణ్ణి, ధనవంతుణ్ణి, విద్యాధికుణ్ణి పెళ్లిచేసుకుంటా ననుకుంది. కాని యిప్పుడు తనెవర్ని చేసుకుంది?

శోభనపుగదిలోకి పంపించి టఫీమని తలుపువేసేటప్పుడు గుండె ఆగిపోతుందా అనిపించింది. కొద్దినిముషాల్లో మేల్కొన్నట్లు యేవేవో ఆలోచనలతో మెదడు మళ్లీపనిచేయటం మొదలుపెట్టింది.

సుందరం పుస్తకం పడవేసి ఆమెవేపు చూశాడు. ఆమె దగ్గరగావచ్చి నిలుచున్నాడు. శాంతతల దించుకొనే బుసకొట్టోంది. చెయ్యిపట్టుకోబోయాడు. విదిలించుకుంది.

సుందరం వంగి ఆమెకళ్లల్లోకి చూశాడు. ఆమె అక్కడనుంచి చరచరా మంచందగ్గరకు పోయి నిలుచుంది. ముఖం కందగడ్డలావుంది.

దగ్గరగావెళ్లి నిలుచుని "ఇది నిజంకాదనుకుంటాను..." అన్నాడు.

పగడ యెత్తిన నాగులా తలయెత్తింది. కటువుగా ముఖం చిట్లించుకొని "నిజం ముమ్మాటికీ నిజం— నావేపు చూడక్కర్లేదు. నావిషయం మర్చిపోవాలి!"

ఈమాటలు అనటానికి అదనుకోసమే యీఐదు నెలలూ యెదురుచూసింది! ఈమాటలు అప్పచెప్పటానికే పెళ్లి ఆడితీరాలనుకుంది!! ఈమాటలాడి హృదయంలో బరువుతగ్గించుకోవాలని రాత్రింబగళ్లు యేకధాటిగా ఆలోచించుకొని కూర్చుంది!! కాని, యీమాటలు యిప్పుడు ఆడటంవల్ల ప్రయోజనం గురించిగాని, రాబోయేపరిస్థితులగురించిగాని ఆమె ఆలోచించలేదు ఈమాటలు ఒకనాడు ఆమెగుండె నెలాచీల్చివేశాయో అంతకంటే అధికంగా సుందరంగుండెను చీల్చుతాయని ఆశించింది. కాని, సుందరం అక్కడనుంచి ఆమెలా చరచరా వెళ్లిపోలేదు. ఆలానే నిల్చునివున్నాడు. ఈసన్నివేశం ఆమెకు వెర్రెత్తించింది. కొఱకొఱా చూసింది... కాని చలించకుండా సుందరం అలానే నిల్చున్నాడు. వాడినవ్వునవ్వి "చాలాదూరం ఆలోచించి అన్నవేనా యీమాటలు!" అని ప్రశ్నించాడు.

ఈప్రశ్నతో ఆమె తోకత్రొక్కిన పాములా చర్రున లేచింది—"నివ్వే తెలివైనవాడివి కా" వంది.

ఈఏకవచనప్రయోగంతో విస్మితుడై యేమీమాటాడలేకపోయాడు. తిన్నగాపోయి మళ్లీ పుస్తకంపట్టుకున్నాడేగాని విప్పలేదు.

ఆ మరుచటిరోజు రాత్రి శాంత సరాసరి వచ్చి పందిరమంచంమీద పడుకుంది. సుందరం చాలాసేపటివరకూ అలా చారబడి యేదో ఆలోచించుకుంటున్నాడు.

లేచి శాంతదగ్గరగా వెళ్లి "మళ్ళీ ఒకసారి ఆలోచించావా?" అన్నాడు.

ఈ యేకవచనప్రయోగం వినటం యిదే మొదటిసారేమో—ఆమెకు రిమ్మెత్తింది.

"అఖ్కర్లేదు. వెళ్లొచ్చు!" అంది.

"మళ్ళీ మళ్ళీ ఆలోచించ మంటున్నా"

"వెళ్లిపోవాలి కామోసు...!" రెండోవేపు తల తిప్పి లేచింది

"వెళ్ల మననే నెప్పుడూ అనను తప్పులు తెలిసి చెయ్యడం. అందుకోసమే మళ్ళీ మళ్ళీ ఆలోచించమంటున్నా" అంటూ వెళిపోయి కుర్చీమీద చారబడ్డాడు.

మూడోరోజు రాత్రి దగ్గరగానేవచ్చి "మనసులో పెట్టుకోక యేదైనా అనాలని వుంటే అనొచ్చు".

శాంత యేమీ మాటాడలేదు. సుందరం మెల్లగా జుట్టు పీక్కుంటూ వెళ్లి కుర్చీమీద కూలబడ్డాడు.

౮

రోజుకు రోజూ సుందరం చాలాగంభీరంగానే వుంటున్నాడు. శాంతకు పట్టుదల మరీ హెచ్చయింది. వీళ్లయిరువురి ప్రవర్తన కనిపెట్టిన నరసమ్మ యేదోఅనుమానాన్ని మనసులో పెట్టుకున్నా కూతుర్ని యేమీఅడగలేదు. ఒక్కొక్కసారి తన గొప్పతనం భర్త తెలుసుకోటానికి యీవిషయం పనికొస్తుందేమో నని అనుకున్నా, ఆయనతో చెప్పటానికి సాహసించలేకపోయింది. సుందరం యిప్పుడు అల్లుడైనందుకు యేమాత్రమైనా మారుతాడనీ, ఆమెఅడుగులకు మడుగు లొత్తుతాడనీ

ఆశించింది! అలాంటిదేమీ లేకపోవటం, పైపెచ్చు ఆమెచేసే పనులకు మెదురు తిరగటంకూడ జరుగుతోంది. అన్నివిషయాలలోనూ భర్త అల్లుడినే సమర్థించటంతో వెర్రెత్తింది.

వేసవికాలం. అదివారమునాడు తెల్లవారేసరికి డాక్టరుగారు విశాఖపట్నంనుంచి తిరిగివచ్చారు. స్నానం, ధ్యానం అయ్యాక వాలుకుర్చీమీద కూర్చొని కూతురువేపు చూసి "సుందరాన్నీ, మీఅమ్మనూ పిలుచుకరామ్మా" అన్నారు.

శాంత క్రిందకుపోయి కొంతసేపు గదిలో కూర్చొని తరవాత అమ్మదగ్గరకువెళ్లి "నాన్న నిన్నూ, ఆయననూ రమ్మంటున్నారే" అంది. నరసమ్మకూడ అల్లుడితో మాటాడదేమో 'పిలువలేకపోయావా?' అంది. శాంత ముఖంతిప్పటం చూసి నరసమ్మ వంటమనిషితో "సుంకరమ్మా! సుందరం ఆగదిలో వున్నాడు, బాబుగారు పిలుస్తున్నారని చెప్పు!" అంటూ కూతురుతో కలిసివెళ్లింది.

ఏంచేస్తారో అని మేడమీదకు ముందుగావచ్చిన భార్యే, కూతుర్ల వేపుచూసి యేమీ మాటాడలేదు. సుందరం రాగానే "రా బాబూ, కూర్చో, రా" అన్నారు. అంతవరకూ నిల్చున్న ఆత్మీయుల మనస్సులు చివుక్కుమన్నాయ్. తొడలమీద చేతులు ఆన్చి పరిశాంతంగా కూర్చొని డాక్టరువేపు చూస్తున్నాడు సుందరం.

"ఈ ఉద్యోగాన్ని విడిచిపెట్టవలసి వస్తుందిరా బాబూ!"

సుందరం మాటాడలేదు. ముఖంలో మాత్రం గంభీర చిహ్నాల బదులు సంశయం కొట్టుకలాడింది.

"ఆనాడు బదిలీమీద డిస్పెన్సరీకి వచ్చేటప్పుడు ఒక పెద్దమనిషితో మాటాడుతుండటం నీకు జ్ఞాపకం వుందనుకుంటాను. నిన్ను చూడగానే అప్పటికే రాధమ్మ పెళ్లివిషయం చికాకుపడివున్నానేమో నీమీద ఆశకలిగింది. ఆ పెద్దమనిషి నాస్నేహితుడు. విశాఖపట్నంలో పెద్దపేరున్న గవర్నమెంటు డాక్టరు. నే కోరినకోరికకు యీసంవత్సరం యింకొకరికి మాట యిచ్చాను; వచ్చేసంవత్సరం తప్పకుండా అన్నాడు. మొన్న ఆయన వుత్తరంవ్రాస్తే నే వెళ్ళాను..."

డాక్టరుగారు ఆపారు: తలెత్తి వింటున్న సుందరం తల నించేశాడు.

డాక్టరుగారు మళ్ళీ ప్రారంభించారు. ఈసారి భార్య వేపు చూపుపారేస్తూ "నాపేరుప్రతిష్ఠలు నిలబెట్టేవాడు ఒకడు దొరికాడని ఆశపుట్టింది యిన్నాళ్లకి." మళ్ళీ సుందరంవేపు మోముతిప్పి "నివ్వూ నాలానే పెరిగావ్. ఒకరిదగ్గరకుపోయి చెయ్యిచాపటం నాలా నీకూ పేదరికంలోకూడ చేతనయ్యింది కాదు. మాఅమ్మలా మీఅమ్మా చెయ్యిచాపింది. కొడుకులు లేకపోయినా నాకేవిచారంలేదు. నివ్వేదో ఆ డాక్టరుపరీక్ష పాసయివచ్చాక నేను కాస్త విశ్రాంతితీసుకోవచ్చు."

ఈమాటలు అనేటప్పుడు తల్లీకూతురు ముఖాలు దించుకున్నా సుందరంమాత్రం తలెత్తేవున్నాడు. డాక్టరుగారిగొంతుక చాలాఅభిమానంతో నిండుకపోయింది. ప్రతిమాటా హృదయంనుంచి వస్తుంటే సుందరం కళ్లల్లో పూరే నీటిప్రవాహాన్ని ఆపేప్రయత్నంలో వుండి యేదో అందామనుకున్నా అనలేకపోయాడు.

డాక్టరుగారు నవ్వుముఖంతో లేచారు. భార్యతో పరిహాసాలకికూడా యిదేసమయంలా వుంది. "పెద్దమ్మాయ్ పెళ్లిప్పుడూ యేడ్చావ్! చిన్నమ్మాయ్ పెళ్లప్పుడూ యేడ్చావ్! నీకష్టాలకి యెవరే అయ్యారు? పెద్దవాడు నిన్న మూడునెలలు సేవచేసి బ్రతికించాడు. ఈ చిన్నవాడు నీవుబ్రతికినంతకాలం నెత్తినపెట్టుకొని పోషిస్తాడు!"

కూతురువేపు చూస్తూ "మీపెద్దక్క నామాటవింది. మొగుడ్ని పెద్దయింజనీర్ని చేసుకుంది. నివ్వూనామాటవిన్నావ్. నీ మొగుణ్ణి పెద్దడాక్టర్ని చేసుకుంటున్నావ్..." అంటూ నే సుందరం దగ్గరగావచ్చి కూర్చున్నవాడితల నిమిరి "మన సుందరంది చల్లనిచెయ్యి—చల్లని చూపేనమ్మా?!"

ఈమాటలతోపాటు పొందే ఆనందం, చూపేఅభిమానం ద్విగుణీకృతం కావటంతో శాంత అక్కడనుంచి మెల్లగా జారిపోయింది.

డాక్టరుగారు మళ్ళీ కుర్చీమీద కూలబడి భార్యవేపు చూస్తూ "నాకెప్పుడూ ఒక్కచింతే వుండేది. నా మిగతా అల్లుళ్లంతా పెద్దహోదాలలో వుండి యీచిన్నవాడే గుమస్తాగావుండటం!! వాళ్లూ నివ్వూ కలిసి యింతమంచివాడిమీద విరుచుకపడ్డారు. చివరకు మిగిలిందేమిటి? ఎవరు యెంతవిరుచుకపడ్డా, లేతగుండైనా సహించాడు. కష్టపడేవాడే చివరకు సుఖపడటం లోకంపోకడ. ఇప్పుడైనా అల్లుడితో మాటాడతావా?"

ఈసూటిప్రశ్నతో సుందరంచెయ్యి ముడుకులమీదనుంచి జారిపోయింది! నరసమ్మ ప్రక్కకుతిరిగి కళ్లనులుపుకుంటూ ఒక

మెట్టు దిగేసరికి చివరిమెట్టుమీద నిల్చొని చెవులు రిక్కించి వింటున్న శాంత అగపడింది.

౯

అల్లుడు మామలు కలసి విశాఖపట్నం వెళ్లారు. చేయవలసిన యేర్పాటులన్నీ చేసుకొని తిరిగి వచ్చేటప్పుడు సుందరం సరసమ్మకోసం, వంటమనిషికోసం చీరలు తెచ్చాడు. వచ్చిన రోజు సాయంత్రమే శాంత సినీమాకు వెళ్లేప్రయత్నంలోవుంది. గదిలో అలంకరించుకునేటప్పుడు టేబిలుమీద సంపెంగపూలను చూసింది. సింహాచలం సంపెంగలేమో ఘుమ ఘుమ లాడుతున్నాయ్. తలలో పెట్టుకోవాలని వుబలాటం హెచ్చినా చాలాసేపటివరకు ముట్టుకోడానికి మనసొప్పిందికాదు. చివరకు యెలాగో ఒక పువ్వుతీసి జడలో పెట్టుకోబోతుండగా అప్పుడే గదిలోనికివచ్చిన సుందరం "పూజకోసం తెచ్చినపువ్వులు..." అర్థోక్తిలో ఆపేశాడు. శాంత చటుక్కున తలలో పెట్టున్న పువ్వును క్రిందపారవేసింది. పారవేసిన పువ్వును చేతపట్టుకొని నిలుచున్నాడు. శాంత రొప్పుకుంటూ అక్కడనుంచి వెళ్లిపోయింది!

ఆవేళరాత్రి చాలాసేపటివరకూ పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. శాంతరాలేదు. వేకువఝామున తెలివివచ్చేసరికి లైటువేసి చూశాడు. శాంత గదిలోలేదు.

మూడోరోజు వుదయం స్నానంచేసి మేడమీద పుస్తకం పట్టుక కూర్చున్నాడు. ఒకభాగంపూర్తిచేసి తలెత్తేసరికి డాబామీద శాంత అగపడింది. జుత్తు ఆరేసుకుంటోంది. ముఖంనిండా యిదివరలా పసుపురాసుకుని వుందేమో తళుక్ తళుక్ మని

మెరుస్తోంది. కాటుకకళ్లల్లోని మెరుపును ఒకసారి దీక్షగా చూశాడు. ఈవేళ గులాబిరంగు సిల్కుచీర పల్చని నీలిరంగు జాకెట్ వేసుకొనివుంది. చాలసేపటికిగాని మనసు మళ్లించుకో లేకపోయాడు. శాంతగదిలోనికి వచ్చింది. సుందరాన్నిచూసి మళ్ళీడాబామీదకు వెళ్లిపోయింది. రెండుచేతులూ డాబాపిట్ట గోడకు ఆన్చి పడమటివేపు చూస్తోంది.

సుందరం మనసు అదుపులో వుంచుకోలేక పుస్తకం పట్టుకొనే డాబామీదకు వెళ్లి రెండోచివర నిల్చున్నాడు. అప్పుడప్పుడు ఆమెవేపు చూపుపారేస్తూ చివరకు "ఒకవిషయం చెప్పాలని వుం" దన్నాడు

"వినాలని లే'' దంటూ శాంత గబగబా మెట్లు దిగి పోయింది.

రేపుఉదయం సుందరం ప్రయాణం అనగా యీవేళ సాయంత్రమే అన్నీ సర్దుకొని స్నానంచేసి షికారుకని బయలు దేరాడు. పంచెకట్టి, బెంగాలీషర్టుపై పల్చని పాటినీలుఝురీకండువా కప్పుకొని షికారుకు పోదామని మెట్లుదిగుతుండగా రాధ అప్పుడే రావటం చూశాడు. "ఏం వదినా? ఇదేనా రావటం?" అని పలకరించాడు.

"అవును బాబూ...షికారుక్కా మోను" అంటూనే ఆగింది.

ఈ బాబూ అని అలవాటున్నట్లు సంబోధించే చొరవ అట్లే పరిచయంలేని వదిన తీసుకోవటంతో "అవును" అన్నాడు— ఆలోచనగా నవ్వుతూ

"ఒంటరిగా..."

"కుక్కని తోడుతీసుకవెళ్లమంటూరా?" నిస్సంకోచంగానే ప్రశ్నించాడు. ఈప్రశ్న వేసే సమయానికి శాంతా, నరసమ్మ అక్కడకు వచ్చినా రాధ చూడలేకపోయింది.

కాస్త గింజుకుంటున్న వదిన వేపు చూస్తూ—

"ఏం వదినా, మనుషులకంటే కుక్కలే విశ్వాసంమైనవి కావూ?"

రాధ తల దించింది. మనసులో వికారాన్ని దాచిపెట్టి వచ్చింది. మరది అనుకోనివిధంగా చొరవచేసుకొని మాటాడటంతో ముఖంమాడిపోయింది. కాని స్పృహతెచ్చుకొని పొడి నవ్వుతో "నిజంచెప్పారుబాబూ!" అంది.

అంతవరకు మెలాగో అక్కడనిలుచున్న శాంత చెంగు చెంగున గదిలోనికి పోయింది. "మాటాడండి, వస్తాను" అంటూనే వెళ్లిపోయాడు సుందరం.

ఈ వెళ్లేవిధం, చిన్నకూతురు గదిలోనికి వెళ్లిపోయే టప్పుడు అల్లుడు చూపించేవైఖరి నరసమ్మకు తెగులుపుట్టించింది!

కూతురును గదిలోనికి తీసుకపోతూ "ఎంతగతిలేక చేసుకున్నా..." సగంలో మూతి ముడుచుకుంది.

"ఏమైంఁ దేంటి!"

"ఇంకేం కావాలె! చిన్నదానితో మాటాడతాడా యేమన్నా? నామీదకూడ విరుచుకపడతాడు! ఏమయినా అంటే మీనాన్నగారికి నేనే చెడ్డదాననమ్మా" అంటూ చీర కొంగుతో కళ్లు ఒత్తుకుంది.

రాధ తల్లి వేసే ప్రశ్నలకు, కబుర్లకు మానాన్నే ప్రదర్శించింది. శాంతవచ్చి "కబురులేకుండా వచ్చేశావేమక్కా?"

అంది. ఈప్రశ్నకు జబాబు రాకపోవటంతో నరసమ్మ అందు కుంది: "మనయింటికి రాటానికి కబురుండాలమ్మా! అయినా తప్పుమంది. ఒకనాడైనా రా నాయనా అని అల్లుణ్ణి పిలి చారా యేమన్నానా?"

"పెద్దభావ పిలుస్తే వస్తున్నాడే!"

"భావుందే! నివ్వేలానైనా మాటాడతావ్— యింట్లో పెట్టుకోని"

అక్క యిలా దెప్పిపొడవటంతో శాంత అక్కడనిల్చో లేదు. రాధ చాలా సేపటివరకు తల్లి చెప్పేమాటలను తల దించి విన్నది. చీకటి పడింది. లేచి చెల్లెలిగదిలోనికి వెళ్లి లైటువెలి గించి చూసేసరికి శాంత కుర్చీమీద కూర్చొని తల చేతులమీద ఆన్చివుంది. పక్కనే నిల్చొని "చెల్లీ" అంది. శాంత మాటా డలేదు.

"ఏడుస్తున్నావే!" అంది చెయ్యివేస్తూ. "అబ్బే" అంటూ శాంత తలెత్తింది. కాని ముఖం అక్కవేపు తిప్పలేదు. రాధ మెల్లగా కిటికీదగ్గరకువెళ్లి నిల్చొని తోటలో వెన్నెలలో చెట్లు మెల్లగా తలలూపటం చూసింది...అలా నిల్చొనే "నివ్వెందు కేడవాలే?" అంది.

ఈ ప్రశ్నలో మిళితమయియున్న భావాన్ని అర్థంచేసు కున్న శాంతలేచి అక్కదగ్గరకువెళ్లి భుజంమీద మెల్లగా చెయ్యివేసింది! రాధ కొయ్యబొమ్మలా నిల్చొనివుంది. శాంత ముందుకు వంగి చూసేసరికి అక్కముఖం నల్లబడివుంది. కళ్లలో నీరునిండుకొని వున్నాయ్

"అక్కా" అంది ఆత్రుతతో. రాధ మాటాడలేదు.

"ఏడుస్తున్నావేమే?"

"ఏమీ లేదు" చాలా సేపటికి యీ మాటలని కంటి రెప్పలను ఆడించింది.

"ఆనాడూ అలానే చేశావక్కా!" అంది శాంత, దిగజారిన స్వరంతో.

"ఏం చెప్పమంటావే? ... బూడిదై పోయినా ... ఆడది ఆదారిన వెళ్ళిపోతోంటే బూడిద యెగురుతుందట! ... ఇదేనే వాళ్ల వంశమర్యాద?"

ఆగి ఆగి అంటున్నా ముంచుకొస్తున్న యేడుపును అణుస్తూ యేదో ఆవేశంతో అక్కడనుంచి వెళ్ళిపోయింది.

శాంత అలానే నిల్చుండిపోయింది. కిటికీదగ్గరనిల్చున్నదేమో తోటవేపు చూస్తోంది. కొంత సేపయ్యాక సుందరం మెల్లగా తలదించుకుంటూ రావటం చూసింది. వాకిటలఆగాడు. జేబు ఒకసారి తడుముకొని ఒక అడుగువేసి వరిక్కకుచూశాడు.

"ఏం వదినా!..."

"ఏం పోయింది బాబూ, వెతుక్కుంటున్నట్టున్నారు!"

"అబ్బే యేమీలేదు..."

అంటూనే యిద్దరూ గదిలోనికి వచ్చేసరికి డాక్టరుగారు వెనకనే వచ్చారు. రాధను శాంతనుకున్నారేమో "చిన్నమ్మాయ్" అని పిల్చారు. ఈ గొంతుక వినగానే రాధశరీరం ఒక్కసారి గగుర్పాటు జెందింది. ముఖం చూపించటానికి యెక్కడలేని భయం వేసింది. నాన్న గదిలోనికే వచ్చి రాధవేపు చూసి "నివ్వెంత సేపై వచ్చావమ్మా?...అల్లుడుకూడా వచ్చాడా? ఈ వారంరోజుల్లో వీలుచూచుకొని నేనే వద్దామనుకుంటున్నా."

ఈ చివరి వాక్యంతో రాధ మొదటిప్రశ్నలను మరచి పోయింది. నాన్నను తూలనాడిన భర్తయింటికి ఈజన్మలో నాన్న వస్తారని ఆమె అనుకోలేదు! వదిన తడబడటం గ్రహించిన సుందరం అన్నాడు:

"సాయంత్రమే వచ్చారు. నేను వెళ్ళిపోతున్నానుగా— చూసిపోదామని. ఆయనకేదో పనుండి రాలేకపోయాడు!"

మరది యీసర్ది చెప్పటంతో తలమీదనున్న యేదో పెద్ద భారం దిగిపోయిం దనిపించింది. కాని లిప్తలోనే, 'చూసిపోదామని...' మరదిఅన్న యీమాటలు మళ్ళీ మనసులో దొర్లుకపోగా మామూలు పరిస్థితికే వచ్చింది!

"నీ వ్వెళ్ళేటప్పుడు నేనూ వస్తానమ్మా..."

నాన్న యీ మాటలు అనేటప్పుడు చేతిలోగాజులు వూడబెరుక్కోవా లన్నంత చిరాకెత్తిందామెకు. నాన్న మరది వేపు మాటలు మళ్ళించటంతో అక్కడినుంచి కదలిపోటానికి అదునుదొరికింది.

"చాలా సీరియస్ కేసు. ఆవూర్లో రేపటివరకు వుండవలసివస్తుందేమో! నేను తిరిగివచ్చేసరికి బహుశః వెళ్ళిపోతా వనుకుంటాను..." అంటూనే డాక్టరుగారు అల్లుడి భుజంమీద చేయివేసి మేడమీదకు తీసుకుపోయారు.

భోజనాలు పూర్తయాయ్. డాక్టరుగారు చాలాసేపయింది జట్కామీద వెళ్ళిపోయారు. సుందరం గదిలో కుర్చీలో కూలబడి యింటివసారావేపు చూస్తూ ఆలోచిస్తున్నాడు. శాంత పచ్చీరావటంతోనే మంచంమీద చారబడింది, వదినతో

మాటాడాలని మనసుపుట్టడంచేత లేచి ప్రక్క గదిలోనికి వెళ్ల బోతోంటే ఆమె యెదురైంది

"రా వదినా" అన్నాడు గదిలోనికి మళ్లీ వెళ్లిపోతూ.

రాధ వచ్చింది. "కూర్చోండి" అంటూ కుర్చీచూపిం చాడు. రాధ కుర్చీమీద కూర్చోలేదు. నేలమీద కూర్చో బోతోంటే "అదేంటి వదినా — శ్రీమంతులయింట్లో పుట్టి కటిక నేలమీద కూర్చుంటారు?"

"ఎక్కడ కూర్చుంటే యేం రామంబాబూ!" అంది.

సుందరం యీసంబోధనతో మొగం వేలవేశాడు. ఈ కొత్త పేరేమిటి వదినా అని అడుగుదామనుకుంటే రాధ చప్పున "అయ్యో! మాచిన్నమరది రామంపేరు వచ్చేసింది..."

"ఆయనను 'బాబూ' అని పిలుస్తారనుకుంటాను"

'హాఁ' తలదించుకొనివున్న రాధ అంది. వదినకు నవ్వింం చాలసేపు ప్రయత్నంలోవున్న సుందరంవేపు తలెత్తి చూసిపోడి నవ్వు నవ్వుతూ "అయితే బాబూ, మానాన్నలా మీరూ రెండుచేతులతో గడిస్తారన్నమాటే!"

"అలాఅని యెందుకనుకోవాలి వదినా! మనం అనుకు న్నట్లు జరిగితే యింకేంకావాలి? నిజంచెప్తాను—నేనెప్పుడైనా డాక్టరు నవుతానని అనుకున్నానా?"

"ఎవరుమాత్రం అనుకున్నారు? అయినా ఆవేళ రాత్రి నాన్న మీతో ఆడినమాటలు జ్ఞాపకానికి తెచ్చుకుంటే యెందు కాశ్చర్యపడాలి?"

"ఏంమాటలు? మీరెప్పుడు విన్నారు?... ఏదో గుట్టు లాగుదామని చూస్తున్నారేమో!"

"విన్నాను బాబూ! నాగురించికూడ చెప్పేరుగా?"

"అంతరాత్రిమీద మీరెలా విన్నారు వదినా?"

"చెప్పనా"

"చెప్పండి చూద్దాం..."

"ఒక డాక్టరుకు యిచ్చి నన్నే యింట్లో వుంచుకోవాలని వుండేదట కాని మేమంతా కాకుండా చేశామని — అయినా చిన్నమ్మాయి వుందిగా? అన్నారు. దీనినిబట్టి నే నేం అనుకోవాలి?"

"కాని మీ రనుకొన్నట్లు నేను అనుకోలేదు వదినా! వదినా! చిన్నమ్మాయిమీద ఆశపెట్టుకున్నారంటే దానినిబట్టి నే నేం అనుకుంటాను? ఆయనచిన్నల్లుడు డాక్టరు కావాలి. ఆ అవకాశం యీజన్మలో వుంటుందని అనుకోలేదు. మొన్నటి వరకు మీనాన్నగారు నన్నింట్లో యెందుకు తెచ్చిపెట్టారో చెప్పలేదు. అంచేత నేను ఒకరిమీదనైనా లేని అసహ్యాన్ని తెప్పించుకోవలసివచ్చింది—"

ఈమాటలు ఆగి ఆగి అంటూనే శాంతవేపు చూస్తున్నాడు. శాంత మంచంమీద యిటూ ఆటూ వుండి వుండి దొర్లుతోంది! బహుశఃఆమె ఒకనాడు మేడమీదకువెళ్లి అడగాలనుకున్న ప్రశ్నకు సమాధానం దొరికిందేమో!

నోరు ఆవలించి వింటున్న వదినతో మళ్ళీ అన్నాడు: "మీరన్నట్లు రెండుచేతులతో గణిస్తానే అనుకోండి— కాని గడించేడబ్బు యేం చెయ్యాలి?"

"ఇదేమిటి బాబూ! ఇంత ధర్మసందేహం!"

"అబ్బే! అబ్బే! డబ్బుఖర్చుపెట్టడం సంగతికాదు!"

కాస్త గాబరాపడుతున్న మరదివేపు దీక్షగా చూసింది. ఆయనముఖం శాంతవేపు తిరిగివుండటతో అటుతిరిగింది. శాంత పరుపుమీద చేతితో తలపట్టుకొనివుంది.

"బాబూ! ఒకమాట అంటాను. కోపగించుకోరుకదూ!?" రాధ మరదివేపు చూస్తూనే అంది.

"కోపం యెందుకు? కోపమేవుండివుంటే యీ ఇంటి అల్లుణ్ణే కాకపోయివుదును!"

ఈ విసురుబాణంలా, నిద్రనభినయిస్తున్న భార్యమనసుకు గుచ్చుకోవటంతో ఆమె లేచి కిటికీదగ్గరకు కుర్చీలాక్కొని కూర్చుంది. సుందరం ఆమెవేపు చూడటానికి వీలుపడకుండా మధ్యను మంచంవుంది.

"ఈప్రణయకలహాలెందుకు బాబూ?"

"రాయబారం వచ్చారావదినా?" అన్నాడు చిన్ననవ్వు నవ్వుతూ!

"నాకు చెల్లిదా బాబూ? పెళ్లికిరాకపోయినా......"

"రాకపోయినా వచ్చినవాళ్లకంటే హెచ్చుచేశారు. అప్పుడు మీరురాసినపుత్తరం మరచిపోతానా వదినా?"

శాంత యీమాటలువినగానే గతుక్కుమంది. ఆమెకు వ్రాసినపుత్తరం సంగతికూడ అక్క యెత్తుతుందేమో అనుకుంది. కాని రాధ అంది—"అందులో యేంవుంది బాబూ? మీరు చూపినఅభిమానానికి ఆమాత్రమయినా..."

"మీనోటంటే యీమాట వినటం!"

"అభిమానంకాదూ! పెళ్లినాడు అంతకష్టపడ్డారు. అంతకన్నా ఎప్పటికైనా మరచిపోనివిషయం మీరుచెయ్యలేదా?"

"ఏమిటి వదినా? ఈయింట్లో యెవరూ సరిగ్గా మాటాడరే—అలాంటిది నన్ను పైకెత్తేస్తున్నారు."

"మనస్ఫూర్తిగా అక్షతలు జల్లింది—ముఖంనిండా ముత్తైదువులచేత బొట్టుపెట్టించారు. నేను గర్వించేటట్టు పళ్లెరాన్ని బోర్లింపజేశారే—ఎలా మరచిపోమంటారు బాబూ?"

సుందరం జవాబియ్యటానికి మాటలకోసం తడుముకొని చివరకు "అదంతా మీనాన్నగారు చేశారు"

"కారకులు మీరేగా—దానిమాటకేం— మీరు రేపు వెళ్ళిపోతున్నారు—ఆలోచించండి బాబూ!"

సుందరం మౌనంగా కూర్చున్నాడు. గదిలో చాలా నిశ్శబ్దంగావుంది. ఉండివుండి వీచేచల్లగాలి ఆయన ఆలోచనలకు కొత్త జీవం పోస్తోంది—

"నన్నేంఆలోచించమంటారు?"

రాధ యీప్రశ్నకు జవాబీయలేదు. కొంతసేపయ్యాక సుందరం అభిమానపూరకకంఠస్వరంతో "అభిమానానికి ఒక హద్దంటూవుంది. హద్దుమీరే అభిమానాన్ని జూపించేవారిని లోకం అర్థంచేసుకోలేదు. వాళ్లని లోకువచేస్తుంది!" కాస్సేపు ఆగి మళ్లీ అన్నాడు— "మీరు మనస్ఫూర్తిగా అడిగారు కాబట్టి యీమాటలైనా అన్నాను. నేను ఆలోచించవలసింది యేమీ లేదు. ఆలోచించవలసినవాళ్లు అహంభావంతోవుంటే..."

రాధబ్రతుకంతా యీమాటల్లోనే యిమిడిపోయింది! తప్పులేని తను తొందరపడి యిప్పుడుయింత ఆలోచనలోనికి యెందుకుపడాలి? అసలు కోరికలు ఫలించాయని హద్దుమీరిన అభిమానాన్ని చూపించబట్టి ఆయన లోకువచేశాడు. లోకం

పోకడ మరదిచెప్పటంతో తల బరువెక్కి యెక్కడున్నదీ మరచి పోయింది...

"రేపు తెల్లారేసరికి ప్రయాణం! నేను యిల్లు కదిలేటప్పుడు, పోనీ, అభిమానంతో సాగనంపడానికి మీరైనా వచ్చారు?"

ఈ మాటలతో ఆమె తలెత్తి చూసింది. సుందరంకళ్లు యేదో బాధతో మండుకపోతున్నట్లగపడ్డాయ్. ఆయనముఖం ప్రక్కకు త్రిప్పేసరికి లీలగాకనపడే మరదికళ్లల్లో నీరుచూసి లేచిపోయింది. "వస్తాను బాబూ" అంటూనే వెళిపోతోంటే "వినదచుకోలేదని కసరకుండా మీరైనా విన్నారు"అన్నాడు.

సుందరం యెవరికి వినపడా లనుకున్నాడో వాళ్లకు స్పష్టంగానే వినపడింది.

సుందరం వాలుకుర్చీమీదే నిద్రపోయాడు. ఒకసారి తెలివివచ్చేసరికి శాంత యింకా కిటికీదగ్గరే కూర్చొనివుంది. పరుపువేసుకొని పడుకున్నాడు.

వేకువఝామున తెలివివచ్చేసరకి శాంత మేల్కొనేవుంది. సుందరం స్నానంపూర్తిచేసి బట్టలువేసుకున్నాడు. శాంతకుర్చీమీద చెదిరిపోయిన జుత్తుతో కూర్చొని కిటికీగుండా తోటలోనికి చూస్తోంది.

సుందరం ఆమెదగ్గరగా వచ్చి నిలుచున్నాడు. తెల్లవారే సమయంలో వీచే మందమారుతం చెదిరే ముంగురులను చెదరిస్తున్నట్లుగా ఆమెమనసు చెదరసాగింది. భర్తవేపు చూడాలనుకుంది; కాని కంటిరెప్పలు బరువెక్కిపోయాయ్. ఆమె ఆశించినట్లు ఆచల్లనిచేయి తాకటంగాని, ఆచల్లనిపిలుపు విన

టంగాని జరగలేదు. సుందరం మళ్లీ వెనుకకు వెళ్లాడు. ముందు రోజు సాయంత్రం వేసుకున్న బంగాళీషర్టు జేబులోనుంచి యేదో తీస్తుండటం చూసింది!

దగ్గరగావచ్చాడు. ఆమెయెదురుగా కిటికీదగ్గర బంగారు గాజులజత పెట్టాడు. ప్రక్కకుతప్పుకొని చేతులు కట్టుకొని నిలుచున్నాడు. మెల్ల మెల్లగా ఒక్కొక్కమాటా తోణికేస్తున్నాడు...

"నిన్న వీటినే అమ్మలేకపోయాను. ఈవేళ కొన్న వూరికే మళ్ళీ తీసుకవెళ్లి యింకో స్త్రీచేతికి తొడిగించి చరిత్రహీనుడ్ని కాదలచుకోలేదు. ఆవూరునుంచి తెచ్చిన సంపెంగ పువ్వు యెలా విసిరేశావో- అలావిసిరేస్తే విసిరేయవచ్చు—వెళ్తున్నా." తిరిగి వెళిపోతూనె "ఇకనైనా విసవిసలాడకుండా హాయిగా బ్రతుకు!!"

ఈమాటలు అన్నాక సుందరం మళ్లి గదిలోనికిరాలేదు. బెడ్డింగు పెట్టె గదిలోనుంచి వెళిపోతున్నప్పుడుకూడ ఆమె అటు వేపు చూడలేకపోయింది. కాస్సేపటికి అక్కగొంతుక వినబడినా అలా శిలప్రతిమలా నిల్చొని వుండిపోయింది.

సుందరాన్ని సాగనంపుతూ "అక్కడకు వెళ్లాక నేనే వుత్తరం వ్రాస్తాను బాబూ" అంది రాధ. ముందుకు పోయే వాడు చటుక్కున ఆగి, వదినవేపు చూశాడు. ఆమె కళ్లెత్తే సరికి యింకా సుందరం ఆమెవేపే చూస్తున్నాడు.

"సంతోషం వదినా!" అంటూ యెదురుగ్గావున్న జట్కా దగ్గరకు పోయాడు. రాధ ముందుకు మూడే అడుగులు వేసి ఆగిపోయింది.

కిటికీగజాలు గట్టిగా పట్టుకొని చూస్తున్న శాంత ఆ చల్లనిచూపుకోసం తహతహలాడింది. ఆమెకళ్లల్లో మరుగు పడ్డది మరుని భావాలు బాధకాదు—ఏదో తెలుసుకోలేని బాధతో మండిపోతున్న మనసుకు కళ్లకు జట్కా మెల్లగాపోతున్నట్లు ఆగపడటంతో కాళ్లుఒక్కసారి వణికాయ్. కిటికీమీద గాజలజతను గట్టిగా పట్టుకొని కుర్చీమీద కన్నీటితో కూలబడింది.

భారతి జూన్ 1950.